జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



bahujan bazaar

మీరు కోరుకున్న పుస్తకాలు / ప్రొడక్ట్స్ మీ ఇంటికి వద్దకే చేర్చే ఆన్లైన్ షాపింగ్

To Order Visit : www.bahujanbazaar.in
Contact No. : 8886022523



సంపుటి 16 సంచిక 140 విశాఖపట్నం ఆదివారం 14 జనవరి 2024 8 పేజీలు వెల : 5.00


# 'ఇండియా' కూటమి చైర్మన్‌గా ఖర్గే!

- పోటీ నుంచి తప్పకొన్న బీహార్ సీఎం నితీశ్
- దీదీ, అఖిలేశ్, ఉద్ధవ్ తో చర్చించాక డెసిషన్
- వర్చువల్ గా మీటింగ్.. పాల్గొన్న 14 పార్టీలు

ప్రజాపాలన ప్రతినిధి :

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఇండియా కూటమి కన్వీనర్ గా ఎంపికయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇవాళ వర్చువల్ గా జరిగిన ఇండియా కూటమి సమావేశంలో నేతలంతా ఖర్గే పేరును ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కూటమి కన్వీనర్ రేసులో ఉన్న బీహార్ సీఎం, జేడీయూ అధ్యక్షుడు నితిశ్ కుమార్.. ఆ పోస్టును కాంగ్రెస్ పార్టీ నుంచే ఎవరైన తీసుకుంటే బాగుంటుందని చెప్పినట్లు సమాచారం. అయితే పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఎస్పీ అధినేత అఖిలేష్, ఉద్ధవ్ థాక్రేతో చర్చించిన తరువాత ఫైనల్ డిసిషన్ తీసుకోనున్నట్లు కూటమి నేతలు తెలిపారు. 14 పార్టీలు పాల్గొన్న ఈ వర్చువల్ మీటింగ్ లో ప్రధానంగా లోక్ సభ ఎన్నికల్లో సీట్ల షేరింగ్ విషయంపై నేతలు చర్చించారు. అదే విధంగా రాహుల్ చేపట్టే భారత్ జోడో న్యాయ్ యాత్రలో పాల్గొనడంపై సమాలోచనలు చేశారు. కూటమి పార్టీల మధ్య అభిప్రాయ బేధాల విషయంలోనూ నేతలు మాట్లాడుకున్నారు. కాగా వేరే కార్యక్రమాలలో బిజీగా ఉన్న మమతా బెనర్జీ ఈ సమావేశానికి హాజరుకాలేదు.



# తెలుగు ప్రజలకు జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి అంటేనే అచ్చ తెలుగు పండుగ అని ఆయన అన్నారు. ప్రతి గ్రామానికి శోభను తీసుకొచ్చే పండుగని మన సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే పండుగ అని చెప్పారు. స్వగ్రామాలకు తిరిగి వెళ్లి, తమ కుటుంబ, సాంస్కృతిక మూలాలకు విలువనిచ్చే పండుగ అని అన్నారు. మన ప్రభుత్వం 56 నెలల్లోనే గ్రామ సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థ, హెల్త్ క్లినిక్ లు, రైతు భరోసా కేంద్రాలు, ఇంగ్లీషు మీడియం స్కూళ్లు, బ్రాడ్ బ్యాండ్ సదుపాయంతో అక్కడే కడుతున్న డిజిటల్ లైబ్రరీలు, ప్రతి పేద సామాజిక వర్గానికి చరిత్రలో ఎన్నడూ లేనంతగా అందిన లబ్ధి ఇవన్నీ పల్లెలు మళ్లీ కళకళలాడేందుకు ఎంతగానో ఉపయోగపడ్డాయని జగన్ తెలిపారు. నిన్నటి కంటే నేడు, నేటి కంటే రేపు, రేపటి కంటే భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించగలం అనే భరోసా ఇవ్వగలిగితేనే ఇంటింటా సంక్రాంతి అని నమ్మి, ఆచరిస్తున్న ప్రభుత్వంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్నతెలుగు వారందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు అని జగన్ తెలిపారు.

# సీఐడీ కార్యాలయంలో పూచీకత్తు సమర్పించిన చంద్రబాబు



అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు విజయవాడ సీఐడీ కార్యాలయానికి వెళ్లారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, ఇసుక, మద్యం కేసుల్లో ఆయన పూచీకత్తు సమర్పించారు. ఈ కేసుల్లో చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే వారం రోజుల్లో దర్యాప్తు అధికారి ఎదుట హాజరై పూచీకత్తు సమర్పించాలని బెయిల్ షరతులు విధించింది. దీంతో చంద్రబాబు సీఐడీకి కార్యాలయానికి వెళ్లి దర్యాప్తు అధికారిని కలిశారు. ఇదే కేసుల్లో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, విశ్రాంత ఐఏఎస్ అధికారి నరేష్‌పై ఆరోపణలు ఉన్నాయి. వీరికి సైతం హైకోర్టు మందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఇక సీఐడీ కార్యాలయం వద్దకు చేరుకున్న చంద్రబాబును చూసేందుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎగబడ్డారు. అందరికీ అభివాదం చెబుతూ చంద్రబాబు సీఐడీ కార్యాలయంలోకి వెళ్లారు.

# ఢిల్లీలో పడిపోయిన ఉష్ణోగ్రతలు..

## రెడ్ అలర్ట్ ప్రకటించిన ఐఎండి

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీని చలి వణికిస్తోంది. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. శనివారం ఢిల్లీలోని శివారు ప్రాంతమైన అయా నగర్‌లో మెహ్రౌలి - గుర్గావ్ రోడ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 3 డిగ్రీల సెల్సియస్ మేర తగ్గింది. వరుసగా రెండోరోజైన శనివారంరోజు కూడా అత్యంత చలి తీవ్రత ఎక్కువగా ఉన్న రాత్రిగా నమోదు కానుంది. చలి, దట్టమైన పొగమంచు పరిస్థితుల దృష్ట్యా భారత వాతావరణ శాఖ శనివారం (ఐఎండి) రెడ్ అలర్ట్ ప్రకటించింది. వాతావరణ పరిస్థితుల రీత్యా దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి ఢిల్లీకి వెళ్లే 18 రైళ్లు 1 నుంచి 6 గంటలపాటు ఆలస్యంగా నడుస్తున్నాయి. పొగమంచు మంచు వల్ల



దృశ్యమానత సరిగ్గాలేకపోవడం వల్ల ఢిల్లీ విమానాశ్రయంలోని పలు విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఉదయం 5.30 గంటలకు ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ ప్రధాన వాతావరణ కేంద్రం వద్ద 200 మీటర్ల దృశ్యమానత ఉంది. ఇక ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకున్న దృశ్యాలు కనిపించాయి. శనివారం ఉదయం 9 గంటలకు ఢిల్లీలో గాలినాణ్యత స్థాయిలు 365గా నమోదైనట్లు సెంట్రల్ కాలుష్య నియంత్రణా బోర్డు (సిపిసిబి) సమాచారం తెలిపింది. ఢిల్లీతోపాటు పంజాబ్ రాష్ట్రానికి ఐఎండి రెడ్ అలర్ట్ జారీ చేసింది. పొగమంచు కారణంగా హర్యానా, చండీగఢ్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రత 19 డిగ్రీల సెల్సియస్‌లు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. పంజాబ్, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని శివారు ప్రాంతాల్లో చాలా దట్టమైన పొగమంచు కురిసింది. అలాగే హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేవ్, బీహార్, అస్సామ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, రాజ స్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా పొగమంచు కురిసిందని ఐఎండి తెలిపింది. కాగా, శుక్రవారం రాత్రి ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 3.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. లోడి రోడ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 3.4 డిగ్రీలు, సఫ్దర్‌జంగ్‌లో 3.6, రిడ్జ్‌లో 3.9 పాలంలో 5.8 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు ఐఎండి తెలిపింది.

# బాపట్ల అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయనున్న డాక్టర్ కటికల శివ భాగ్యారావు!!



చింతలపూడి (ప్రజాపాలన ప్రతినిధి): అణగారిన వర్గాల హక్కుల కోసం పార్టీని ఏర్పాటు చేయడమే కాకుండా, బీసీ అభ్యర్థి ని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా అందరిని ఏకతాటిపైకి తెస్తున్న ఆల్ తెలుగు ప్రజాపార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కటికల శివ భాగ్యారావు రానున్న ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో బాపట్ల నియోజకవర్గం నుండి శాసనసభకు పోటీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. శనివారం గుంటూరు జిల్లా చింతలపూడిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంకు ముఖ్య అతిధిగా హాజరైన ఆయనను కేకే ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ , స్నేహ గ్రూప్ కుటుంబ సభ్యులు మరియు స్థానిక ప్రజానీకం, ఆయనకు అత్యంత ఆత్మీయులు బాపట్ల నియోజకవర్గం నుండి ఆయన పోటీ చేయాలని కోరగా ఆయన అందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తుంది. ఈ సమావేశంలో ఆయనకు అత్యంత సన్నిహితులు, ఆత్మీయులు పాల్గొనగా వారందరు కలిసి ఆయన బాపట్ల నుండి శాసనసభకు ఆల్ తెలుగు ప్రజా పార్టీ తరుపున పోటీ చేయాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఈ సమావేశం రాజకీయ సమావేశం కాకున్నా ఆయనకు అత్యంత సన్నిహితులు చేసిన విజ్ఞప్తి పట్ల ఆయన సానుకూలంగా స్పందించినట్లు బాపట్ల నుండే పోటీ చేస్తానని వారికి తెలిపినట్లు ఆయన సన్నిహితులు కొందరు తెలిపారు. అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం గత ఇరవై నాలుగు ఏళ్ళ నుండి పలు సంస్థలు స్థాపించి కృషి చేస్తుండడంతో పాటు ఈ యేడు బీసీ ని ముఖ్యమంత్రి చేయడమే ముఖ్య ఎజెండాగా ఆల్ తెలుగు ప్రజా పార్టీ ని స్థాపించి అన్ని వర్గాల వారిని ఏకతాటిపైకి తెచ్చిన డాక్టర్ కటికల శివ భాగ్యారావు ఎక్కడి నుండి శాసనసభకు పోటీ చేయనున్నారని వస్తున్న ఊహాగానాలకు తెర పడేలా ఆయన తన సన్నిహితుల, ఆత్మీయుల, కార్యకర్తల కోరిక మేరకు బాపట్ల నుండి పోటీ చేస్తానని తెలిపినట్లు సమాచారం. ఈ సమావేశంలో పెద్ద ఎత్తున ఆయన ఆత్మీయులు, బాపట్ల నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ.కటికల.రవి కుమార్, స్టేట్ కో ఆర్డనేటర్ శ్రీ.నమ్మి.అప్పారావు యాదవ్ , తదితరులు పాల్గొన్నారు





## స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS

SNEHA CLUB — PAY BACK TO SOCIETY

SNEHA GROUP OF ORGANISATIONS — 23 YEARS CELEBRATIONS

(Regd. No.AMC/VSP/DCO/2008/2446 Dated 07-03-2008)

**BENEFITS**

- Safe and confidential
- High rate of Interest On Deposits
- No Income Tax deduction on Interest Payment
- Financial growth to all
- Support Your Business
- Easy Sanction of loan to share holders
- Dividend paid to the Share holders (since 10 Years)

Schedule of Interest Rates on Fixed & R.D.Accounts

| Term | | General | Senior Citizens |
|---|---|---|---|
| 91 Days | - 179 Days | 8.25% | 8.75% |
| 180 Days | - 1 Year | 9.25% | 9.75% |
| 1Year | - 2 Years | 10.25% | 10.50% |
| 2 Years | - 3 Years | 10.50% | 10.75% |
| 3 Years | - 5 Years | 11.00% | 11.50% |
| Above 5 Years | | 12.00% | 12.50% |
| Saving Bank A/C | | 5.00% | 5.00% |
| Recurring deposit | | 6.00% | 6.50% |

Money Multiplier Scheme
Your valuable money is Double in 7 Years
Minimum 10,000/- and above

SPS
సంవత్సరానికి 11.00%వడ్డీ ఇవ్వబడును. మీ డిపాజిట్ పై లభించే వడ్డీ

| | |
|---|---|
| రూ. 1,00,000/- | రూ. 11,000/- |
| రూ. 5,00,000/- | రూ. 55.000/- |
| రూ. 10,00,000/- | రూ. 1,10,000/- |

*షరతులు వర్తిస్తాయి

ఆంధ్రప్రదేశ్ : విశాఖపట్నం : 0891-2791205,9246663046,7660027696 చింతలపూడి : 7660027675
తెలంగాణ : హైదరాబాద్ : 040-23233989, 7660027682 పొన్నూరు : 9618444604

ఆంధ్రప్రదేశ్ : డోర్.నెం.50-61-3, సీతంపేట, రాజేంద్రనగర్, విశాఖపట్నం-530016
తెలంగాణ : డోర్.నెం. 6-29÷3,మూడవ అంతస్తు , దౌలత్‌ప్లాజ, లక్డీకాపూల్, హైదరాబాద్-500 004.
E-mail:snehamacsltd@gmail.com

## జనసేన కార్యాలయంలో సంక్రాంతి వేడుకలు



నరసాపురం, జనవరి 13 (ప్రజాపాలన ప్రతినిధి) : జనసేన పార్టీ మనఊరు- మనఆట కార్యక్రమంలో భాగంగా స్థానిక నియోజకవర్గ జనసేన పార్టీ కార్యా లయంలో నియోజకవర్గ ఇంచార్జి బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో వీర మహిళలు బొమ్మిడి సునీత, పోలిశెట్టి నళిని, తోట అరుణ, వలవల సావిత్రి, పిప్పళ్ల సుప్రజ, బొమ్మిడి విశాలి, మోటుపల్లి కిరణ్మయి, జడ్డు స్వాతి, వర్ధినేని పద్మావతి, కటికిరెడ్డి సింధు, కొప్పాడి మీనా ల పర్యవేక్షణలో సంక్రాంతి వేడుకలను, ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. అనంతరం భోగి మంటలు వేసి సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ భోగభాగ్యాలతో జరుపుకోవాలని ప్రతి ఇంట పండుగ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యాలయంలో సంక్రాంతి పండుగ వేడుకలను నిర్వహించడం చాలా సంతోషకరమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెనిగండ్ల విన్నూత్న సంక్రాంతి సంబరాలు




గుడ్లవల్లేరు ప్రజాపాలన : గుడివాడ తెలుగు దేశం పార్టీ ఇంఛార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు మండలంలో సంక్రాంతి సంబరాలు విన్నూత్నంగా జరిగాయి. సంక్రాంతి సరదాలను నింపేందుకు మండలంలోని గుడ్లవల్లేరు, కూరాడ, శేరీదగ్గుమిల్లి, కౌతరం, చిత్రం, పెంజంద్ర గ్రామాల్లో మహిళలకు, చిన్నారులకు, యువకులకు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించామని వెనిగండ్ల ప్రతినిధి నరసింహారావు తెలిపారు. ఈ పోటీలలో సుమారు రెండు వేల మంది పాల్గొనగా, బహుమతులుగా నిత్యావసర సరుకులను అందించామన్నారు. ప్రజల అవసరాలకు తగినట్లుగా వినూత్నంగా ఆలోచించి వారిలో సంతోషాలను నింపడమేగాక, యువకుల దృష్టి జూదాలవైపు మరలకుండా చేసిన వెనిగండ్ల రాముకు మహిళలు కృతజ్ఞతలు తెలుపుతున్నారని ప్రతినిధులు పేర్కొన్నారు.

# ముదునూరి చేసిన అభివృద్ధి కన్నా అవినీతి ఎక్కువ: మాజీ ఎమ్మెల్యే బండారు



నరసాపురం, జనవరి 13 (ప్రజాపాలన ప్రతినిధి) : గోదావరి ఏటిగట్టు కొట్టుకుపోవడానికి స్థానిక ఎమ్మెల్యే ప్రసాదరాజు అవినీతే కారణమని నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అన్నారు. నాసిరకం రాళ్ళను వాడటం వల్లే ఏటిగట్టు కొట్టుకుపోయిందని దీనిపై గతంలో తాను గవర్నర్ నుండి సబ్ కలెక్టర్ వరకు తెలియ జేసినా పట్టించుకోలేదని అన్నారు. ఈ అవినీతిలో పనుల్లో అధికారులు ఎమ్మెల్యేతో కుమ్మక్కు అయ్యారని రాళ్ళ నాణ్యతపై సమర్పించింది బోగస్ క్వాలిటీ సర్టిఫికేట్ అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తిరస్కరించిన క్వారీ నుండి రాళ్లు వాడారని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చెయ్యాలని మాధవ నాయుడు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అవినీతిపై తమ అధినేత నారా చంద్రబాబు నాయుడి దృష్టిలో పెట్టగా గతవారం ఆచంట వచ్చిన ఆయన ఏటిగట్టు అవినీతిపై మాట్లాడి వారం కూడా గడవకముందే ఈ సంఘటన జరిగిందని అన్నారు. భీమవరం ఎమ్మెల్యే జిల్లాకేంద్రం కోసం మంత్రి పదవి వదులుకున్నారని స్వయానా ముఖ్యమంత్రి చెప్పారని నరసాపురం అభివృద్ధి కన్నా ఎమ్మెల్యేకు తన వ్యక్తిగత లబ్దే ముఖ్యమని ఈ సందర్భంగా ప్రజలకు తెలిసిందని అన్నారు. నరసాపురం అభివృద్ధి కోసం రూ. 3,197.54 కోట్ల పనులకు సీఎం శంకుస్థాపన చేసి 14 నెలలు గడిచినా కనీసం ఒక్కపని కూడా మొదలు కాలేదని ఈ పనులపై ఎమ్మెల్యే కనీసం శంకుస్థాపన చేసిన శిలా ఫలకాలయినా ప్రజలకు చూపించగలరా అని ఆయన ప్రశ్నించారు. ఈ నెల 20 తేదీలోగా ఎమ్మెల్యే ఏటిగట్టు పనుల అవినీతిపై స్పందించక పోతే 21 నుండి తాము ప్రజా ఉద్యమం చేపడతామని మాధవ నాయుడు హెచ్చరించారు. భోగి పండుగ రోజున %శ్రీ% వైసిపి ప్రభుత్వం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసామని చూపిస్తున్న పత్రాలు భోగి మంటల్లో వేసే కార్యక్రమం చేపట్టి నరసాపురం మోసగాడిని సాగనంపాలని ఈ సందర్భంగా బండారు మాధవ నాయుడు పిలుపునిచ్చారు.

## అంగరంగ వైభవంగా ఆర్.బి.కె, ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవ వేడుకలు



వేటపాలెం, జనవరి 13, ప్రజాపాలన : వేటపాలెం మండలం అక్కాయిపాలెం గ్రామంలో,రు.50లక్షల రూపాయలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమాలు, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చేతుల మీదుగా, అంగరంగ వైభవంగా జరిగాయి. అక్కాయిపాలెం గ్రామంలో చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కరణం వెంకటేష్ ల సహకారంతో,2019 నుండి 2024 వరకు, రు.5కోట్ల 42లక్షల రూపాయలతో చేసిన అభివృద్ధిపనుల శిలాఫలకాన్ని, చీరాల శాసన సభ్యు లు కరణం బలరామకృష్ణమూర్తి చేతులమీదుగా ఆవిష్కరించారు.కార్యక్రమంలో పంచాయితీరాజ్ డి.ఇ.శేషయ్య, ఎంపీడీఓ నేతాజీ, ఏ.ఓ.కాశీ విశ్వనాథ్, వైసిపి మండలపార్టీ అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ జంగిలి రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, యువతఅధ్యక్షులు ఆవుల అశోక్, మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య, కర్రా వెంకటేశ్వర్లు, విజయ్, పులి హరికృష్ణ, జిడుగు మస్తాన్,పిట్టు పోలయ్య,ఆవుల కొండలు, షేక్ కజ్జ, షేక్ హౌలీ, గవిని వెంకటరావు, బొంతగొర్ల కోటేశ్వరరావు, గవిని నాగరాజు, గవిని గోపి, గొల్లప్రోలు శ్రీరామ్ మూర్తి, కాటూరి నాగయ్య, ఏపీఎం శ్రీనివాసులు,సెక్రటరీలు, సచివాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువతి హత్య కేసులో పోలీసులను అభినందించిన కడప జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్



బద్వేల్ ప్రజా పాలన ప్రతినిధి: బద్వేలు రూరల్ పరిధిలో యువతి హత్య కేసులో ముద్దాయిలపై నేర నిరూపణ చేసి యావజ్జీవ కారాగార శిక్ష పడేందుకు కృషి చేసిన ఎస్.ఐ, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్.పి శ్రీ సిద్దార్థ్ కౌశల్ ఐ.పి.ఎస్ ప్రశంసా పత్రాలు అందచేసిన జిల్లా ఎస్.పి ఇదే స్ఫూర్తిని కొనసాగించి నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేయాలి జిల్లా ఎస్.పి శ్రీ సిద్దార్థ్ కౌశల్ ఐ.పి.ఎస్ జిల్లాలోని బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021 సం.లో జరిగిన డిగ్రీ విద్యార్థిని హత్య కేసులో ముగ్గురు ముద్దాయిలకు కోర్టు యావజ్జీవ కారాగారశిక్ష విధించింది. ఫాస్ట్ ట్రాక్ కేసు గా పరిగణించి తగిన సాక్ష్యాధారాలతో నేర నిరూపణకు కృషి చేసిన బద్వేలు రూరల్ ఎస్.ఐ జె.చంద్రశేఖర్, ఏ.ఎస్.ఐ ఆర్.వి నరసింహారావు, కోర్టు కానిస్టేబుల్ ఏ.సురేష్ బాబు (హెచ్.సి 892), కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్ కానిస్టేబుల్ సి.హెచ్ జాకబ్( హెచ్.సి 402) లను జిల్లా ఎస్.పి శ్రీ సిద్దార్థ్ కౌశల్ ఐ.పి.ఎస్ గారు శనివారం ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి గారు మాట్లాడుతూ ఫాస్ట్ ట్రాక్ కేసు ట్రయల్ సమయంలో సాక్షుల విచారణ, కేసు రికార్డులు, కోర్టు వ్యవహారాలలో ప్రత్యేక శ్రద్ధ కనబరచి కేవలం రెండు సంవత్సరాల ఐదు నెలల్లో ముద్దాయిలకు శిక్ష పడేలా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించి నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేయాలని జిల్లా ఎస్.పి శ్రీ సిద్దార్థ్ కౌశల్ ఐ.పి.ఎస్ ఆకాంక్షించారు.

## కాళాకరులను అందుకోవడం ప్రతి ఒక్కరి భాధ్యత - నేషనల్ హైవ్ ఆఫ్ అథారిటి ప్రాజేక్టు డైరెక్టర్ గూడపాటి



గుడివాడ : కళాలు అంతరించికు పోయి ఎంతో మంది కాళాకారులు నేడు అర్థికం చితికిపోయరని వారికి ప్రతి ఒక్కరు తమ వంతు సహయం అందిచాలని నేషనల్ హైవే ఆఫ్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ గూడపాటి భానుప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో కళాకారుల సమైక్య అద్వర్యంలో పేద కళాకారులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న నేషనల్ హైవే ఆఫ్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ గూడపాటి భానుప్రసాద్ చేతుల మీదుగా దుస్తులు, పిండి, వంటలు సంక్రాంతి కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య గౌరవాధ్యక్షులు బి.రామ్మోహన్‌రెడ్డి, అధ్యక్షులు విన్నకోట సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ జవ్వాజి గంగరాజు, వసుద బసవేశ్వరరావు. సుఖమంచి మల్లిక్, ఆత్మకూరు సాంబశివరావు ,అమ్ముల సువర్ణ, నల్లారి శ్రీనివాసరావు, బాబు, లోయ రాధాకృష్ణ, ముత్యాల నాగేశ్వరరావు, నాగేశ్వరావు, శేషగిరిరావు, సత్యం, పార్వతి, బి.నాగలక్ష్మి, డి.వరలక్ష్మి, పాల్గొన్నారు.

## ధనియాలపేట ప్రజలకు త్రాగునీరు అందించాలి: సామాజీకవేత్త ఆర్‌కె



గుడివాడ : స్థానిక 30 వార్డులోని ధనియాలపేటలో గత కోన్ని రోజులుగా వార్డ ప్రజలు త్రాగునీరు లేక అనేక ఇబ్బందులకు గురివౌత్తునరని వెంటనే అధికారులు స్పందించి నీరు అందజేయాలని సామాజీకవేత్త డా॥ మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) కోరారు. శనివారం వార్డు ప్రజల విన్నపం మేరకు ఆర్‌కె వారియర్స్ అధ్వర్యంలో ట్యాంకర్ ద్వార త్రాగునీరు అందజేశారు. ఈ సందర్బంగా ఆర్‌కె మాట్లాడుతూ దనియాల పేట ప్రజలకు మంచినీరు సదుపాయం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. మునిసిపల్ అధికారులు ఒకసారి వార్డులో పరిశీలించి నీటి సమస్యను పరిష్కరిచాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ మీరాషరీఫ్, నూనె అయ్యప్ప, గంట ఆంజనేయులు, దివిలి సురేష్, చరణ్‌తేజ్, నాగసాయి, పాల్గొన్నారు.

## అయప్ప దేవస్థానం భక్తులకు వెనిగండ్ల అధ్వర్యంలో అన్నదానం



గుడివాడ : స్థానిక బంటుమిల్లి రోడ్డులోని స్వామి అయ్యప్ప దేవస్థానంలో గత కోన్ని రోజులుగా టిడిపి నియెజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము నిర్వహిస్తున్న అన్నదానం శనివారం విజయవంతంగా ముగిశాయి. శ్రీ స్వామి అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో మండల, మకర జ్యోతి మహొత్సవాలు ఉత్సవాల ముగింపు వేడుకల్లో దేవస్థాన అన్నదాన కమిటీ సభ్యులతో కలిసి గుడివాడ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ వెనిగండ్ల రాము పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షాదారులకు ముగింపు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో 60 రోజులపాటు, ఉత్సవాలు విజయవంతంగా ముగియడం సంతోషకరమన్నారు. నియోజకవర్గంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పార్టీ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా తాను అన్ని విధాలుగా సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొత్త వీరయ్య, టివి.సుబ్బారావు, కొల్లిపర సాయివెంకటరమణ, యక్కలీ మణిదీప్, కోన శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది

### తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి

**సీఎం ఒత్తిడితోనే చంద్రబాబు పై కేసు**

**చంద్రబాబుకు మద్దతుగా 70 దేశాలలో ప్రదర్శనలు**

**జగన్ రెడ్డికి యావజ్జీవ శిక్ష తప్పదు**

**పక్క చూపులు చూస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు**



పర్చూరు, జనవరి 13, ప్రజాపాలన : అధికార వైసిపికి ఓటమి భయం పట్టుకుందని, సీఎం జగన్మోహన్ రెడ్డి సిఐడిని తన గుప్పిట్లో పెట్టుకుని, చంద్రబాబుని రాజకీయంగా ఎదుర్కొలేక, అక్రమంగా కేసులు నమోదు చేయించారని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. తెలుగుదేశం పార్టీకి, అధినేత చంద్రబాబుకు, ప్రజల నుండి వస్తున్న విశేష స్పందన చూసి ఓర్వలేక, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతుందన్నారు. జగన్ అరాచక పాలన, దాడులు, దౌర్జన్యాలపై, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు జగన్మోహన్ రెడ్డి తీరును, పెత్తందారి పోకడలను వైసీపీ ఎమ్మెల్యే లు, ఎంపీలే బహిరంగంగా ఎండగడుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల దృష్టిని మళ్లించేందుకు, జగన్ జేబు సంస్థ అయిన సీఐడీ ని అడ్డం పెట్టుకొని, చంద్రబాబునాయుడుపై కక్ష సాధింపు చర్యలకు, నీలి మీడియాలో దుష్ప్రచారాలకు దిగుతున్నారని మండిపడ్డారు. తన పార్టీ ఎమ్మెల్యేల, ఎంపీల అసమ్మతిని కప్పిపుచ్చుకునేందుకు, చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. జగన్ ఒత్తిడితో సీబీఐ నమోదు చేసిన కేసుల్లో, చంద్రబాబు వ్యక్తిగతంగా ఆర్థిక ప్రయోజనం పొందినట్టు, సీఐడీ ఎలాంటి ఆధారాలను కోర్టుకు చూపలేకపోయిందని హైకోర్టు వ్యాఖ్యానించి, బెయిల్ మంజూరు చేసిందని గుర్తు చేశారు. జగన్ తీరుతో ఒక్కొక్క ఎమ్మెల్యే, ఎంపీలు పక్క చూపులు చూస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఆర్థిక నేరస్తుడు జగన్....

తీవ్ర నేరారోపణలకు సంబంధించి, జగన్ రెడ్డిపై 38 కేసులు నమోదైవున్నాయన్నారు. రూ. 43వేల కోట్ల దోపిడీపై సీబీఐ, ఈడీ చార్జిషీట్లు కూడా వేసిందని, సదరు కేసులకు సంబంధించి 3,500 వాయిదాలు తీసుకున్నారన్నారు. ఇది దేశంలో రికార్డ్ అని, తాను నేరం చేయకపోతే, శిక్ష పడుతుందనే భయం లేకపోతే కోర్టు విచారణలకు హాజరై, తుది తీర్పు పొందవచ్చు కదా? ప్రశ్నించారు. శిక్ష పడుతుందనే భయంతోనే, కోర్టు విచారణలకు గైర్హాజరతున్నారన్నారు. 12 ఏళ్ల నుంచి 3,500 వాయిదాలు తీసుకున్నారనేది జగమెరిగిన సత్యం అన్నారు. చంద్రబాబు, ఇతర టీడీపీ నేతలపై పెట్టిన కేసుల్లో, సీఐడీ చార్జ్ షీటు వేయలేక పోయిందెందుకు?, ఆధారాలు లేవు కాబట్టి, అవి జగన్ ఒత్తిడితో పెట్టిన అక్రమ కేసులు కాబట్టి, చార్జ్ షీట్ వేయలేకపోయారన్నారు. జగన్‌పై మోపబడిన కేసుల్లో, ఒక ఏడాదిలోనే సీబీఐ, ఈడీ చార్జ్ షీట్లు వేశాయని, 16 నెలలు జగన్ జైల్లో ఉన్నారని, ఆయన కుటుంబ ఆస్తులు జప్తు చేయబడ్డాయని గుర్తు చేశారు. 2004లోరూ. 1.73 కోట్లు మాత్రమే ఆస్తి కలిగి వున్న జగన్ రెడ్డి, 19ఏళ్లలో రూ. 4లక్షల కోట్లకు ఎలా అమాంతం పెరిగాయని ప్రశ్నించారు. ఈ రేంజ్ లో పెరిగిన మరో ముఖ్యమంత్రి, దేశం లో ఎవరూలేరని, ఒక్క జగన్మోహన్ రెడ్డికే సాధ్యమైందన్నారు. అందరూ సీఎంలకన్నా జగన్ రెడ్డి గొప్పవాడా? కాదు, రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసి రు. 4లక్షల కోట్లు కొల్లగొట్టారన్నారు. 16 లిస్టెడ్ కంపెనీలు, మరో 50 సూట్ కేస్ కంపెనీలు, వేలాది ఎకరాలు, 5నగరాల్లో అదిరిపోయే ప్యాలెస్లు, ఆయనకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. 2004లో అప్పుల వల్ల హైదరాబాద్‌లో వున్న ఇల్లు అమ్ముకునే స్థితిలో ఉన్న జగన్, 19 ఏళ్లల్లోనే రూ. 4 లక్షల కోట్లు ప్రజా సంపద కొల్లగొట్టారని మండిపడ్డారు. తన నిలువు దోపిడీపై ప్రజల దృష్టిని మళ్లించేందుకు, అధికార దుర్వినియోగంతో వత్తిడి చేసి, సీఐడీతో చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి, 53 రోజులు జైలు నిర్బంధంలో ఉంచారన్నారు. ప్రజల సంపదను కొల్ల గొట్టిన జగన్మోహన్ రెడ్డికి, యావజీవ శిక్ష తప్పదన్నారు. జగన్ ను 16 నెలలు జైల్లో పెడితే, ఆయన అవినీతిపై దేశంలో, ప్రపంచంలో చర్చ జరిగిందని, ప్రజలందరూ ఆయనకు మద్దతుగా, రోడ్ల మీదకు రాలేదని గుర్తు చేశారు. చంద్రబాబును 53 రోజులు అక్రమంగా జైల్లో పెడితే, ఆయన చేసిన అభివృద్ధిపై, దేశ వ్యాప్తంగా చర్చ జరిగిందని, ప్రపంచ వ్యాప్తంగా 70దేశాలలో సంఘీభావ ప్రదర్శనలు జరిగాయన్నారు. జగన్మోహన్ రెడ్డి అవినీతి, అక్రమాలను పలు సందర్భాల్లో న్యాయమూర్తులు, కోర్టులు తప్పుపట్టాయన్నారు. "మీరు 43 వేల కోట్లు ఎలా సంపాదించారని, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆల్తాబ్ ఆలం ప్రశ్నించారని గుర్తు చేశారు. నా సర్వీస్‌లో ఇటువంటి కుంభకోణం చూడలేదని, ఇన్ని కోణాలున్న కేసు చూడలేదని, సీబీఐ మాజీ డైరెక్టర్ వ్యాఖ్యానించారన్నారు.

## సీట్ల కేటాయింపు లో కురువలకు ప్రాధాన్యత ఇవ్వాలి: పొలిటికల్ జె ఏ సి



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : జనాభా దామాషా ప్రకారం కురువ సామాజిక వర్గాలకు రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని కురువ, మదాని కురువ, మదారి కురువ పొలిటికల్ జె ఏ సి డిమాండ్ చేసింది. శనివారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జె ఏ సి చైర్మన్ కె. రవి కుమార్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో దాదాపు 4 లక్షలకు పైగా ఓటు బ్యాంకు కలిగిన కురువ సామాజిక వర్గాన్ని అన్ని రాజకీయ పార్టీలు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించకుండా మొండి చెయ్యి చూపుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో గెలిచేందుకు తగిన ఓటు బ్యాంకు ఉన్నా ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల సీట్లు కేటాయించడంతో తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తమకు సీటు కేటాయించిన పార్టీకి తమ అభ్యర్థిని గెలిపించి బహుమతిగా ఇస్తామని తెలిపారు. లేకుంటే స్వతంత్రంగా పోటీ చేసి రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించి, తమ సత్తా చాటుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జె ఏ సి నాయకులు కె.సుంకన్న, బిత్తిన కిరణ్ కుమార్, జి యం కె మహేంద్ర, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## 33వ రోజు అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలి

**ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరపోగు రవి**



ప్రజా పాలన ప్రతినిధి పోరుమామిళ్ల: కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలో 33వ రోజు సమ్మె జరుగుతున్నరాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలకు కనీసం 26,000 చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని,ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సుప్రీంకోర్టు మీద జగన్ కి ఏమాత్రం గౌరవం ఉన్నా అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలన్న తీర్పును తక్షణం ఆంధ్రప్రదేశ్లో అమలు చేయాలన్నారు. ధరలు కనుగుణంగా కనీస వేతనాలు చెల్లించమంటే అంగన్వాడీలపై యస్మాని ప్రయోగించి తన బుద్ధిని బయట పెట్టుకున్నాడని విమర్శించారు. అవసరమైతే మరో 30 రోజులు సమ్మె చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని, డిమాండ్లు సాధించుకునే అంతవరకు వెనకడుగు వేసేది లేదని జగన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భైరప్రసాద్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నయ్య, సిఐటియు జిల్లా కమిటీ మెంబర్ ఓబులాపురం విజయమ్మ, మరియు యుటిఎఫ్ నాయకులు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుపేదకు అండగా నిలిచిన కొవ్వలి



నరసాపురం, జనవరి 13 (ప్రజాపాలన ప్రతినిధి) :మన సంపాదనలో కొంత మొత్తాన్ని సమాజానికి సేవలు అందేందుకు వెచ్చించి నిరుపేద కుటుంబాల వారికి సేవలు అందించడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం నరసాపురం పట్టణంలోని స్టీమర్ రోడ్డులో కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి రామ్మోహన్ నాయుడు ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన బార్బర్ షాపును వృద్ధుడు రాజోలు నరసింహ మూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు బార్బర్ షాపును ప్రారంభించి మాట్లాడారు. సమాజం పట్ల బాధ్యతతో, నిరుపేదలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో తన సంపాదనలో కొంత మొత్తాన్ని ఈ విధమైన సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెలగాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కొవ్వలి రామ్మోహన్ నాయుడు అభిమానులు పాల్గొన్నారు.

## ఎంపీ రఘురామకు స్వాగతం పలికిన పొత్తూరి, కొవ్వలి



నరసాపురం, జనవరి 13 (ప్రజాపాలన ప్రతినిధి) :సుదీర్ఘకాలం తర్వాత స్వస్థలం భీమవరం బయలుదేరిన నరసాపురం పార్లమెంటు సభ్యులు కనుమూరి రఘురామకృష్ణం రాజు రాజమండ్రి నుండి రోడ్డు మార్గం ద్వారా భీమవరం ర్యాలీగా బయలుదేరిన నేపథ్యంలో నరసాపురం పార్లమెంటు పరిధిలో చేరుకున్న కనుమూరి రఘురామ కృష్ణంరాజుకు నరసాపురం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడుల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాలకొల్లు నియోజకవర్గంలోని జున్నూరు గ్రామంలో భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణంరాజు వారికి కృతజ్ఞతలు తెలిపారు

# ఆత్మ బంధు దగ్గుమళ్ళ ప్రసాదరావుకు అశేష ప్రజాదరణ

ప్రజా పరిచయ వేదిక సభకు అశేష ప్రజానీకం

హాజరుదగ్గుమళ్ళ దయతోనే బాపట్ల పార్లమెంట్ ప్రజల సమస్యల పరిష్కారానికి మోక్షం

పార్లమెంటులో మూగబోయి న బాపట్ల గొంతు వినిపించా లంటే...

పార్లమెంట్ కు బాపట్ల ప్రజా ప్రతినిధిగా దగ్గుమళ్ళ ప్రసాద రావు ను పంపితేనే సాధ్యం.

స్థానికుడైన ప్రసాదరావు తో నే ప్రజా సమస్యల పరిష్కారం





బాపట్ల, జనవరి 13, ప్రజా పాలన : పార్లమెంట్ కు బాపట్ల ప్రజా ప్రతినిధిగా దగ్గుమళ్ళ ప్రసాద రావు ను పంపితేనే, పార్లమెంటులో మూగబోయిన బాపట్ల గొంతు వినిపించటం సాధ్యమని, దగ్గుమళ్ళ దయ తోనే, బాపట్ల పార్లమెంట్ ప్రజల సమస్యల పరిష్కారానికి మోక్షం లభిస్తుందని, స్థానిక పరిస్థితుల పట్ల, సంపూర్ణ అవగాహన కలిగిన, స్థానికు డైన ప్రసాదరావు తోనే, ప్రజా సమస్యల పరిష్కారం తథ్యమని, బాపట్ల పార్లమెంట్ పరిధి లోని ప్రజలు ఆత్మ విశ్వాసాన్ని వెలిబుచ్చుతున్నారు. బాపట్ల పార్లమెంటు పరిధిలో ఉన్న, 25 మండలాలలో, రమారమి 16 లక్షల మంది కి పైగా ఓటర్లు ఉన్నారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని పరిస్థితులు, 16 లక్షల మంది ప్రజల మనో భా వాలు తెలియని, బాపట్ల గడ్డ మట్టి వాసన తెలియని, స్థానికే తరుడైన ఓ వ్యక్తిని, సీఎం జగన్మోహన్ రెడ్డి కేవలం తన రాజకీయ మైలేజ్ కోసం, ఎస్సీ రిజర్వుడు అయిన బాపట్ల నుం డి పార్లమెంటు కు పంపారు. ఎన్నో సమస్యలతో సతమత మవుతున్న బాపట్ల పార్లమెంట్ పరిధిలోని, ప్రజల గోడును ఏ నాడూ, పార్లమెంట్లో ప్రస్తావించ డానికి ప్రయత్నించలేదని, బాప ట్ల ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.నేడు దానికి ప్రత్యామ్నాయంగా, తమ ప్రాంత కష్టా లు తెలిసిన స్థానిక నేత కోసం, బాపట్ల ప్రజలు వేయి కళ్ళతో ఎదురు చూసే సమయంలో, నేనున్నాను.., నేనున్నాను అంటూ.., ఇండియన్ రెవెన్యూ సర్వీసులో, జాయింట్ కమిష నర్ గా సేవలు అందించిన విద్యావేత్త,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సత్సంబంధాలు కలిగి, పుట్టిన గడ్డ మట్టి వాసన మరిచిపోలేని, దగ్గుమళ్ళ ప్రసా దరావు ఆశాజ్యోతి గా నిలిచా రు. తన కుటుంబాన్ని చక్కప రచుకుని, ఆర్థికంగా స్థిరపడి, తన విశ్రాంత సమయంలో, తన పుట్టిన గడ్డ పై, అక్కా చెల్లెమ్మల, అన్నా తమ్ముళ్ళ, అవ్వ తాతల మమకారాన్ని ఆశించి, వారి సేవలోనే తన శేష జీవితం గడపాలని, పార్ల మెంట్లో మూగబోయిన బాపట్ల ప్రజల గొంతుకని వినిపించాల ని, ప్రజా పరిచయ వేదిక ద్వా రా బాపట్ల విచ్చేసి, భరోసా అం దించారు. బాపట్ల పట్టణంలోనే కాకుండా, బాపట్ల పార్లమెంట్ పరిధిలో ప్రజలు, ఆనందంగా మన దగ్గమళ్ల ప్రసాదరావు అని, ఆప్యాయంగా ఆదరిస్తు న్నారు. ముఖం పై నిత్యం చెరగని చిరునవ్వుతో, అంద రిని కుటుంబ సభ్యులుగా అభిమానిస్తూ, అక్కున చేర్చు కునే ఆత్మీయ బంధువు ప్రసాదరావు, పార్లమెంట్ కు బాపట్ల ప్రజా ప్రతినిధి గా వెళ్తే, ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే అంశం పై బాపట్ల పార్ల మెంట్ పరిధి లోనూ, పట్టణంలో పలుచోట్ల చర్చించుకోవడం శుభపరిణా మం. నిస్వార్థ రాజకీయ నేత గా, ప్రజా సమస్యల పరిష్కా రమే ధ్యేయంగా, బాపట్ల పార్ల మెంట్ అభివృద్ధి కై కంకణం కట్టుకుని, ప్రజలకు సేవలందిం చేందుకు, ఆత్మబంధు దగ్గుమళ్ల ప్రసాదరావు కు, బాపట్ల పార్ల మెంట్ పరిధిలోని ప్రజలు ఆత్మీ యస్వాగతం పలుకుతున్నారు. ప్రజా పరిచయ వేదికకు ఊహించిన దానికంటే వేలాదిగా తరలివచ్చిన జనం.

## చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

**హితవు పలికిన మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



నందిగామ జనవరి 13 ప్రజాపాలన ప్రతినిధి: మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య పై ఇటీవల కా లంలో వైసీపీ నాయకులు అవాకులు చవాకులు పేలి న నేపథ్యంలో ఆమె స్పందించి ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవా లని పట్టణ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వటం జరిగిం ది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక దళిత మహిళనైన నన్ను వైసిపి పార్టీ సమావేశాలలో కా ర్య క్రమాలలో మీన్స్ రూపంలో వీడియోలు తయారుచేసి ప్రదర్శించటం అత్యంత దుర్మార్గమైన చర్యని ఆమె అన్నారు ఇలాంటి చౌకబారు రాజకీయాలు వైసిపి నే తలు మానుకుంటే మంచిదని ఆమె హెచ్చరించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన షేక్ కరీముల్లా అ లియాస్ (దుబాయ్ కరిముల్లా) వారి అనుచరులు క లిసి ఇలాంటివి తయారు చేసి ప్రదర్శించడం దుష్ట రాజకీయాలకు ప్రతీకాని ఆమె పేర్కొన్నారు మహిళా నాయకురాలిపై రాజకీయంగా పోరాడటం చేతకాక స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మొండితోక సోదరులు ఇ లాంటి చౌకబారు దాడులను ప్రోత్సహించడం, వారి తప్పుడు పనులకు సహకరించడం సభ్య సమాజం తలదించుకునే విషయంఅన్నారువిమర్శలు విష యానికే పరిమితం అవ్వాలి కానీ వ్యక్తిగతంగా దాడి చేయడం అధికార పార్టీ వారి చేతకానితనాన్ని మాత్ర మే తెలియజేస్తుందన్నారుఎమ్మెల్యే,ఎమ్మెల్సీ సోద రుల ప్రోద్బలంతో, అండతో దుబాయ్ కరిముల్లా ఇ టువంటి రాజకీయ విష సంస్కృతి తెరలేపాడన్నారు. ఈ విషయంపై వీడియోలు తయారు చేయించి ప్రద ర్శించిన వారిని, అందుకు సహకరించిన వారిపైనా పో లీసు వారు తక్షణమే కేసు నమోదు చేయాలని డి మాండ్ చేశారు లేకుంటే ఈ విషయంపై ప్రత్యక్ష పోరా టానికి దిగవలసి వస్తుందని హెచ్చరించారు ఈకార్య క్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ కార్యక ర్తలు నాయకులు పాల్గొన్నారు

## గుంతల మయమైన రంపయర్రం పాలెం రహదారి



గోకవరం ప్రజా పాలన జనవరి 13: తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం లో ఉన్న గ్రామాల రోడ్లు గుంతల మయంగా దర్శనమిస్తున్నాయి.. గోకవరం నుండి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న రంప ఎర్రంపాలెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో భారీ గుంత ఏర్పడింది దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు గుంతల్లో వాహనాలు పడడంతో వాహన చోదకులు గాయాలు ఫాలుఅవ్వడంతో పాటు వాహనాలు ప్రమాదానికి గురై పాడవుతున్నాయి ఈ రహదారికి ఐదు సంవత్సరాల కిందట మరమ్మత్తులు చేయడం జరిగింది అప్పుడి నుండి ప్రభుత్వ అధికారులు శిధిలమైన రహదారిని పట్టించుకోవడం మానేశారు.కనీసం సంబంధిత అధికారులు ఈ గుంతను పూడ్చకపోవడంతో వాహనదారులు అధికారులపై మండిపడుతున్నారు ప్రమాదపరితంగా ఉన్న ఈ గుంతను పూడ్చ లేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారంటూ విమర్శిస్తున్నారు వాహనదారులు రాత్రిపూట ప్రయాణం చెయ్యాలి అంటేనే బిక్కుబిక్కుమంటున్నారు ఈ రోడ్ల దుస్థితి దారుణంగా ఉన్న పట్టించుకునే నాధుడే కరువాయే అన్న చందాన ఉంది రోడ్ల పరిస్థితి గుంతలతో అధ్వానంగా ఉన్న రోడ్లను కనీస మరమ్మతులు పనులు చేపట్టాలని గ్రామస్తులు వాహనదారులు ప్రజా ప్రతినిధులను అధికారులను కోరుతున్నారు.

## చేయూతమహిళా మార్ట్ ను ప్రారంభించిన కలెక్టర్ విజయరామరాజు



ప్రజా పాలన ప్రతినిధి పోరుమామిళ్ల: పోరుమామిళ్ల పట్టణంలోఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా శనివారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు చేయూత మహిళా మార్ట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేసేందుకు ఈ చేయూత మహిళా మార్ట్ ను పోరుమామిళ్ల పట్టణంలో ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రజలకు సరసమైన అందుబాటులో ధరల్లో నిత్యావసర వస్తువులు, ఇతర ఇంటికి కావాల్సిన వాటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రయోగాత్మాకంగా రాష్ట్రం లోనే మొదటి సారిగా ఈ మార్ట్ ను ప్రారంభించడం జరిగింది అన్నారు. భవిష్యత్తులో అన్ని మండలాలలో ఈ మార్ట్ లను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఎల్సీ గోవిందరెడ్డి, ఎమ్ఎల్ఏ సుధా, బద్వేల్ ఆర్డివో వెంకటరమణ, ఆప్కాస్ రాష్ట్ర డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి, తహసీల్దార్ గంగయ్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కరెంటు రమణా రెడ్డి, ఏరియా కో -ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఏపిఎమ్ అశోక్ కుమార్ రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు పెంచలమ్మ, వెలుగు సిసిలు పిచ్చయ్య, రహీం, రవి, జయచంద్ర, పోలయ్య, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, అధికారులు, డ్వాక్రా మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## నిధులు తేలేని వ్యక్తికి పదవులు ఎందుకు?: తెదేపా నేత కొవ్వలి



నరసాపురం, జనవరి 13 (ప్రజాపాలన ప్రతినిధి) :ఏటిగట్టును పటిష్టపరిచేందుకు గత ఏడాదిన్నర కాలంగా 28 కోట్ల రూపాయల నిధులు తేలేని చేతకాని స్థానిక శాసనసభ్యుడు ముదునూరి ప్రసాదరాజుకు ఎమ్మెల్యే, చీఫ్ విప్ పదవులు ఎందుకని ఆయనకు చేతకాకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొవ్వలి రామ్మోహన్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి వరదల కారణంగా గత 2022 ఆగస్టు నెలలో సంభవించిన వరదల కారణంగా స్థానిక మాధవాయపాలెం వద్ద ఏటుగట్టుకు గండిపడి తీవ్ర ప్రమాదకర పరిస్థితిలు ఏర్పడగా ఆ గండిని పూడ్చేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన 28 కోట్ల నిధులతో ఏటిగట్టు పనులను చేపట్టింది. ఏటిగట్టు నిర్మాణ పనులు నాసిరకంగా ఉన్నాయని పనులలో అవినీతి జరిగిందని ప్రతిపక్షాలు నిలదీయగా స్థానిక ఎమ్మెల్యే వాటిని ఖండించారు. వాటి పనులు పూర్తికాకుండానే తిరిగి శుక్రవారం ఏటిగట్టు నది ప్రవాహానికి కొట్టుకుపోవడంతో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు పరిశీలించేందుకు రాగా పోలీసులు అడ్డుకోవడంపై పొత్తూరి రామరాజు కొవ్వలి రామ్మోహన్ నాయుడులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే బైఠాయించి నుంచి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఏడాదిన్నర కాలం గడిచినా ఏటిగట్టు పనులు పూర్తి కాకపోవడంపై వారు ఏటి గట్ల శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసాపురం అభివృద్ధికి వేల కోట్లు నిధులు తీసుకొచ్చానని చెబుతున్న స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఏటిగట్టు పనులకు కేవలం 28 కోట్ల రూపాయలు నిధులు తేలేకపోవడం సిగ్గుచేటని ఈ సందర్భంగా కొవ్వలి మండిపడ్డారు. ఇప్పటివరకు జరిగిన పనులపై స్థానిక ఎమ్మెల్యే ఏటిగట్ల శాఖ అధికారులు శ్వేత పత్రం విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యకారులు, పలువురు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోనసాగుతున్న జాతీయస్థాయి ఒంగోలు జాత ఎండ్ల బండలాగుడు పోటీలు



గుడివాడ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), కొడాలి చిన్నిల ఆధ్వర్యంలో స్థానిక లింగవరం రోడ్డులోని కె క్వన్షన్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ టూ వైయస్సార్ జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన మూడవ రోజుకు చేరుకున్నాయి. శనివారం సేద్య విభాగంలో జరుగుతున్న ప్రదర్శనను ఎన్టీఆర్ టూ వైయస్సార్ ట్రస్టు సభ్యులు వల్లురుపల్లి సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో పాల్గొన్న పశుపోషకులకు సుధాకర్ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాలడుగు రాంప్రసాద్, వల్లభనేని బానుప్రకాష్, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

ధనియాల పేట వార్డు ప్రజల దాహం తీర్చండి

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

ఆదివారం 14, జనవరి 2024

# టీచర్ల సమస్యలు పరిష్కారమయ్యేనా?

హైకోర్టు స్టేల కారణంగా నిలిచిపోయిన టీచర్ల బదిలీలు, పదోన్నతుల కోసం ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత విద్యా వ్యవస్థపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలి. ఓవైపు ఐఏఎస్, ఐపీఎస్ (పోలీసు ఉన్నతాధికారుల) బదిలీలు కొనసాగుతున్నాయి. మరోవైపు అన్ని ప్రభుత్వ శాఖల్లో త్వరలో అధికారులు, సిబ్బందిని బదిలీ చేయనున్నట్టు సీఎం ప్రకటించడంతో ఉపాధ్యాయులు కూడా బదిలీల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కొంతమంది ఐదారు ఏండ్లుగా ఒకేచోట పనిచేస్తున్నారు. మరికొంత మంది ఉపాధ్యాయులు పన్నెండు, పదమూడేండ్లుగా ఒకే పాఠశాలలో విధులు నిర్వర్తిస్తూ నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు. గతంలో ప్రధానోపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జరిగాయి. స్కూల్ అసిస్టెంట్ బదిలీలు జరిగినా కొత్త పాఠశాలల్లో చేరకుండా వారంతా పాత పాఠశాలల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్త పాఠశాలల్లో చేరేందుకు ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వెయ్యి కండ్లతో ఆశగా ఎదురు చూస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు జరగలేదు. స్కూల్ అసిస్టెంట్ బదిలీలు జరిగినా ఇంకా రిలీవ్ కాలేదు. భాషోపాధ్యాయులకు, ఎస్జీటీ తత్సమాన క్యాడర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు బదిలీలు, పదోన్నతులు వాయిదా పడ్డాయి. రాష్ట్రంలోని 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చడం, జీ.వో 317 పేరిట మారుమూల ప్రాంతాలకు ఉద్యోగ, ఉపాధ్యాయుల సర్దుబాటు, స్థానికులు స్థానికేతరులుగా మారామని, తమకు న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం స్టే విధించడంతో గతంలో బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కోసం గతేడాది విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్‌లో ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలకు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు బదిలీలలో 10 పాయింట్లు కేటాయించింది. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాఠశాలలకు రానటువంటి ఉపాధ్యాయ సంఘాల నాయకులకు అదనంగా 10 పాయింట్లు కేటాయించడం అన్యాయమని కొంతమంది హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. భార్యాభర్తలు ఒకే జిల్లాలో పని చేస్తున్నవారు ప్రభుత్వ, పంచాయతీరాజ్, ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వారికి స్పౌజ్ పాయింట్లు ఇవ్వగా దీనిపై హైకోర్టు స్టే ఇచ్చింది. దీంతో బదిలీలు పెద్ద సమస్యగా మారింది. పలు కారణాల వల్ల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల పిటిషన్ విచారణ ఇప్పటికే ఐదారుసార్లు వాయిదా పడింది. గతేడాది వేసవి సెలవుల కంటే ముందే బదిలీలు, పదోన్నతులు జరుగుతాయని అనుకుంటే హైకోర్టులో వరుస స్టేలతో వాయిదాల పర్వం కొనసాగింది. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో బదిలీలు, పదోన్నతుల కోసం ఉపాధ్యాయులు హైకోర్టు, విద్యా శాఖ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి వాయిదా పడతాయనే భయం ఉపాధ్యాయులను వెంటాడుతున్నది. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పదోన్నతులు జరిగి ఎనిమిదేండ్లు దాటింది. టెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినవారికే పదోన్నతులు దక్కుతాయని నిబంధనలు పెట్టగా.. దీనిపై సీనియర్ ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంలో న్యాయస్థానం జోక్యం చేసుకోవడంతో ప్రభుత్వానికి ముందుకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. 2010కి ముందు ఉద్యోగంలో చేరిన వారికి టెట్ అవసరం లేదని నోటిఫికేషన్‌లో ఇచ్చి ఇప్పుడు పదోన్నతులకు టెట్ తప్పనిసరి అని ప్రకటించడంతో సీనియర్ ఉపాధ్యాయులు అయోమయంలో పడ్డారు. ముందుగా పదోన్నతులు కల్పించి రెండు, మూడేండ్లలోపు టెట్ ఉత్తీర్ణత సాధించాలనే నిబంధనలు పెడితే సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుంది. ప్రధాన ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల పదోన్నతుల కోసం టెట్ తప్పనిసరి చేయడంతో వేలమంది ఉపాధ్యాయులు పరీక్ష కోసం ఎదురు చూస్తున్నారు. సంవత్సరానికి రెండు, మూడు సార్లు టెట్‌ను నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో ఎలాంటి స్టే లేదు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ మేనేజ్‌మెంట్ వారీగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయవచ్చు. టెట్ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన మాత్రమే ఉన్నది. ప్రభుత్వం దాన్ని రెండు, మూడు సంవత్సరాల గడువు ఇచ్చి పదోన్నతులు ఇవ్వడంలో ఎలాంటి ఆటంకాలు, అడ్డంకులు లేవు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలే ఉండటం వల్ల ప్రభుత్వ, పంచాయతీరాజ్ కామన్ సీనియారిటీ గొడవ లేదు. ప్రభుత్వ పోస్టులను హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల చేత భర్తీ చేయడంలో ఎలాంటి ఆటంకాలు గానీ, అడ్డుగోడలు గానీ లేవు. ఉపాధ్యాయులకు పదోన్నతులు లేకపోవడం వల్ల మూడు, నాలుగు పీజీలు, పీహెచ్‌డీలు చేసిన వారు కూడా ఉద్యోగంలో ఏ హోదాలో చేరారో అదే హోదాలో పదవీ విరమణ చేస్తున్నారు. విద్యార్థులకు ప్రయోజనం కలగడానికి ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గ ఉపాధ్యాయులు లేరు. ఉపాధ్యాయులు ఎక్కువ మంది ఉన్నచోట విద్యార్థులు లేరు. ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ( రేషనలైజేషన్ ) ఎనిమిదేండ్ల కిందట జరిగింది. గత ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ప్రారంభించింది. పాఠశాలలకు నూతన భవనాలు, క్రీడా మైదానాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, సైన్స్ లాబ్‌లను ఏర్పాటు చేసి ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలలను తీర్చి దిద్దడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసులతో అడ్మిషన్లు పొందేంతగా పోటీ నెలకొన్నది. మరోవైపు తెలుగు, హిందీ, ఉర్దూ మిగతా దేశీయ భాషలను బోధించే ఉపాధ్యాయులకు గత 26, 27 ఏండ్ల నుంచి పదోన్నతులు లేవు. ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ వారంతా ప్రాథమిక పాఠశాల స్థాయి వేతనాలు తీసుకుంటూ శ్రమదోపిడికి, వెట్టిచాకిరికి గురవుతున్నారు. అప్పటి సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న 10,596 భాషోపాధ్యాయులకు ఉన్నతీకరణ చేస్తూ జీవో జారీ చేశారు.

సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు
editor. prajapalana@gmail.com
మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన
దినపత్రికలో ప్రచురించబడును

# మున్సిపల్ కార్మికుల సమ్మె కొన్ని అంశాలు



కార్మిక వర్గంలో ఉన్న చీలికను ఉపయోగించుకొని సమ్మెను దెబ్బతీసేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయోగాలు చేసింది. పోటీ కార్మికులకు రోజుకి రూ.850 నుండి రూ.1000 వరకు, జె.సి.బి, ప్రొక్లెయినర్ల కాంట్రాక్టర్లకు రూ.50 నుండి రూ.60 వేలు ఇచ్చి పని చేయించేందుకు ప్రయత్నిస్తే కార్మికులు అడ్డుకున్నారు. కొన్ని చోట్ల సమ్మెలో లేని సంఘాల నాయకులే దళారులుగా మారి పోటీ కార్మికులను సరఫరా చేశారు. ప్రభుత్వం సైతం కార్మికులు పూర్తిగా నిద్ర మత్తులో వుండే సమయాన .అంటే తెల్లవారుజామున 3 నుండి 5 గంటల మధ్య పని చేయించేందుకు వేసిన ఎత్తుగడలను కార్మికులు చిత్తు చేశారు. రాష్ట్రంలో ఎన్నికల గోదాలోకి దిగిన అధికార, ప్రతిపక్ష పార్టీల వ్యక్తిగత దూషణలతో రాజకీయాలంటేనే సామాన్య మధ్య తరగతి ప్రజల్లో ఏహ్యాభావం కలుగుతున్న తరుణమిది. ఈ పరిస్థితుల్లో మొదలైన అంగన్‌వాడీ, సమగ్రశిక్ష అభియాన్, మున్సిపల్ కార్మికుల సమ్మెలు ప్రజలందరి దృష్టిని ఆకర్షించే రీతిలో రాష్ట్ర రాజకీయ కలుషిత వాతావరణాన్ని ఒక్కసారిగా మార్చేశాయి. ప్రస్తుతం రాజకీయ పార్టీలు ఈ సమ్మెల చుట్టూ ఆలోచించాల్సి వచ్చింది. ప్రజలు కూడా జుగుప్సాకరమైన రాజకీయ వాతావరణం నుండి కొంత ఊరట పొందగలిగారు. కార్మిక వర్గానికి ఉన్న శక్తి అటువంటిది. కార్మికుల్లో కూడా రాజకీయ చైతన్యం పెరుగుతోంది. ఎందుకంటే ఎన్నికలకు ముందు గద్దెనెక్కేందుకు రాజకీయ పార్టీలు హామీల వర్షం కురిపించడం, గద్దెనెక్కాక వాగ్దానాలను విస్మరించడం పరిపాటిగా మారిపోతోంది. ఈ పూర్వ రంగంలోనే మున్సిపల్ కార్మికులు 2023 డిసెంబర్ 26 నుండి ఎ.పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సమ్మెలో కొన్నిచోట్ల ఎఐటయుసి, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి, ఎంఆర్‌పిఎస్ సంఘాలు కూడా గొంతులు విప్పాయి. వైఎస్‌ఆర్‌టియుసి కార్మికులు కూడా విజయవాడ, తాడేపల్లి లాంటి చోట్ల తోటి కార్మికులతో సమ్మెలోకి వచ్చారు.

**సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వ కుట్రలు**: కార్మిక వర్గంలో ఉన్న చీలికను ఉపయోగించుకొని సమ్మెను దెబ్బ తీసేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయోగాలు చేసింది. పోటీ కార్మికులకు రోజుకి రూ.850 నుండి రూ.1000 వరకు, జె.సి.బి, ప్రొక్లెయినర్ల కాంట్రాక్టర్లకు రూ.50 నుండి రూ.60 వేలు ఇచ్చి పని చేయించేందుకు ప్రయత్నిస్తే కార్మికులు అడ్డుకున్నారు. కొన్ని చోట్ల సమ్మెలో లేని సంఘాల నాయకులే దళారులుగా మారి పోటీ కార్మికులను సరఫరా చేశారు. ప్రభుత్వం సైతం కార్మికులు పూర్తిగా నిద్ర మత్తులో వుండే సమయాన.అంటే తెల్లవారుజామున 3 నుండి 5 గంటల మధ్య పని చేయిం చేందుకు వేసిన ఎత్తుగడలను కార్మికులు చిత్తు చేశారు. చలిలో, దోమల్లో రాత్రి వేళల్లోనూ టెంట్లలోనే వుంటూ దళాలుగా ఏర్పడి గస్తీ చేసి మరీ పోటీ కార్మికులను, పోలీసులను ఎదుర్కొని సమ్మె పోరాటాన్ని కొనసాగించారు. నెల్లూరు, విశాఖ, అనంతపురం, తాడిపత్రి, ఒంగోలు, పుట్టపర్తి, ధర్మవరం, నర్సరావుపేట, ఏలూరు తదితర చోట్ల కార్మికులపై పోలీసు కేసులు నమోదు చేశారు. మున్సిపల్ అధికారులు బెదిరింపు నోటీసులు ఇచ్చారు. అయినా కార్మికులు బెదరలేదు.

**అధికార పార్టీ నాయకుల దౌర్జన్యం**: సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికార పార్టీ నాయకులు నేరుగా రంగంలోకి దిగారు. అమలాపురం, తాడిపత్రి, పుట్టపర్తి, నర్సరావుపేట, విశాఖ, నెల్లూరులలో వారి అనుయాయులను, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను దించడమేగాక, పెద్ద సంఖ్యలో జెసిబిలు, ట్రాక్టర్లను దించారు. ఈ ప్రయత్నాలను ఎదుర్కొనేందుకు కార్మికులు మురిగిపోయిన చెత్త మధ్య నిద్రపోయారు. పోటీ కార్మికులకు, పోలీసులకు దండాలు, దస్కాలు పెట్టి తమ పోరాటాన్ని విచ్ఛిన్నం చేయొద్దని వేడుకున్నారు. ఇంటింటికి లక్షలాది కరపత్రాలు పంచి 'మా న్యాయమైన పోరాటాన్ని బలపర్చండి' అని ప్రజలను అభ్యర్థించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని, బెదిరింపులను ఎదుర్కొంటూ రకరకాల వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొని ధైర్యంగా ముందుకు సాగడం, ఇంజనీరింగ్ విభాగంలోని కొత్త కొత్త సెక్షన్లు సమ్మెలో చేరడం, వేలాది మంది కార్యక్రమాల్లోకి రావడంతో సమ్మెకు దూరంగా ఉన్న కొన్ని సంఘాలు జనవరి 6న కాకుండా 3వ తేదీ నుండే సమ్మెలోకి రావడంతో సమ్మె పోరాటం మరింత విస్తరించింది. ప్రభుత్వం తొలి నుండి పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులను కలవనివ్వకుండా విభజించి పాలించు సిద్ధాంతాన్ని ప్రయోగిస్తోంది. 2019లో గద్దెనెక్కాక పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ పేరుతో రూ.6000 ఇచ్చింది. నాటి నుండి ఇంజనీరింగ్ కార్మికులకు కూడా ఇవ్వాలని సిఐటియు సంఘం పోరాడుతూ వస్తోంది. జిఓ ఆర్‌టి నెం.30లో వేతనాలు తక్కువుగా నిర్ణయించిన వాటర్ సప్లరు, టౌన్ ప్లానింగ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు మొదలగు 8 కేటగిరీలకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నది. దీని ఫలితంగానే జిఓ ఆర్‌టి నెం.30 సవరణ ఫైలు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో పెండింగ్‌లో ఉందని ప్రభుత్వం చెప్పింది. సర్టిఫికెట్లు లేక గత 20-25 ఏళ్లుగా నైపుణ్యంతో కూడిన విధులు నిర్వహిస్తున్న వారికి అన్‌స్కిల్డ్ జీతాలు ఇవ్వడాన్ని సిఐటియు సంఘం వ్యతిరేకించడమే కాదు. 3 లేదా 5 ఏళ్ల సీనియారిటీ ఆధారంగా స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం ససేమిరా అంటున్నది. సర్టిఫికెట్ లేకుండా టెక్నికల్ జీతాలు చెల్లించం అంటూ గత ఎనిమిదేళ్లుగా కాలయాపన చేస్తున్నది. వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణనిచ్చి సర్టిఫికెట్లు ఇవ్వాలని, నైపుణ్యానికి అనుగుణంగా జీతాలు చెల్లించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన ఫలితంగా ప్రభుత్వం అంగీకరించింది. జీతాల పెంపులో ప్రభుత్వం మొండి వైఖరి ప్రస్తుతం జీతాలు పెంచే విషయం గురించి చర్చల సందర్భంగా 2022 జనవరిలో ఆప్కాస్ వారందరికి జీతాలు పెంచారు. మరలా ఐదేళ్ల దాకా జీతాలు పెంచేది లేదంటూ ప్రభుత్వం మొండి పట్టు పట్టింది. మొండిగా ఉన్న ప్రభుత్వాన్ని దారికి తెచ్చేదాకా ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్నవారికి నెలకు రూ.5-6 వేలు చొప్పున రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని పట్టుబట్టాం. "ఇక నుండి ఎవరికీ ఏ విధమైన అలవెన్స్‌లు ఇచ్చేది లేద"ంటూ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ కరాఖండిగా చెప్పారు. అలాంటప్పుడు వీరికి కూడా 11వ పిఆర్‌సి కమిటీ సిఫార్సులకు అనుగుణంగా కనీస వేతనాలు రూ.20 వేలు ఇవ్వండి అనడిగాము. ఒక్క రూపాయి పెంచేది లేదంటూ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. సమ్మె ప్రారంభమై 16 రోజులు గడుస్తున్న పరిస్థితుల్లో పారిశుధ్య కార్మికుల్లో రూ.21 వేలు జీతంపైన ఎంతో కొంత పెంచితే మంచిది. లేదంటే తర్వాత చూసుకుందాం అనే చర్చ ప్రారంభం కావడం, కార్మికులు 123 మున్సిపాల్టీలలోని ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలోకి రాకపోవడంతో కొంత విరామం తీసుకోవాలి. మరలా ఊపిరి పీల్చుకున్న తర్వాత మరో దశ పోరాటాన్ని కొనసాగించవచ్చు. అనే ఉద్దేశంతోనే సమ్మెను వాయిదా వేయడం జరిగింది. సర్టిఫికెట్లు లేనివారికి శిక్షణ, సర్టిఫికెట్ల మంజూరు, పని ఆధారంగా జీతాల చెల్లింపు, స్కిల్డ్, సెమీ స్కిల్డ్, జీతాల చెల్లింపు సమస్యలపై 9 మంది అధికారులతో కూడిన కమిటీని 10వ తేదీనే ప్రకటించడం జరిగింది. శానిటేషన్ మరియు ఇంజనీరింగ్ విభాగ కార్మికులందరికీ మొదటిసారిగా రిటైర్మెంట్ బెనిఫిట్ కింద 10 సంవత్సరాలు సర్వీసు ఉన్నవారికి రూ.75,000, ఎక్స్‌గ్రేషియో, సాధారణ మృతికి 2 లక్షలు, ప్రమాద మృతికి 5 లక్షల నుండి 7 లక్షల రూపాయలు, దహన సంస్కారాలకు 15 వేల నుండి 20 వేల రూపాయలకు పెంపుదలకు ప్రభుత్వం అంగీకరించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఒక్కో కార్మికుడికి రూ.1000 చెల్లిస్తారు. అలాగే సమ్మెకాలం జీతాల చెల్లింపుకు, కార్మికులపై నమోదు చేసిన పోలీసు కేసులు ఉపసంహరించేందుకు కూడా ప్రభుత్వం అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 11వ పిఆర్‌సి బేసిక్ రూ.20,000 కంటే శానిటేషన్ కార్మికులకు రూ.21,000, శానిటేషన్ డ్రైవర్లు, యుజిడి కార్మికులకు 18,500 నుండి రూ.24,500 బేసిక్ జీతంగా మారింది. కార్మిక వర్గం సమిష్టిగా పోరాడితే ఎంతటి నిర్బంధాన్నైనా, విచ్ఛిన్నాన్నైనా ఎదుర్కొని పోరాడి విజయం సాధించగలరని రుజువైంది.

# నీతిబాహ్య రాజకీయాలు

శివసేన చీలిక బృందానికే పార్టీ అధికారిక గుర్తింపును కట్టబెడుతూ మహారాష్ట్ర శాసన సభాధిపతి రాహుల్ నార్లేకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామిక విలువలను అపహాస్యం చేస్తోంది. తన ముందుకు వచ్చిన అనర్హత పిటీషన్లను సంవత్సరాల తరబడి నానబెట్టి, చివరాఖరికి ఆయన చెప్పిన తీర్పు పక్షపాత వైఖరికి పరాకాష్టగా నిలిచిపోతుంది. ఎమ్మెల్యేల అధిక సంఖ్యను, ఎన్నికల సంఘం గుర్తింపునూ ఆసరాగా తీసుకొని ఈ నిర్ణయానికి వచ్చినట్టు నార్లేకర్ ప్రకటించినప్పటికీ- ఆది నుంచి అతడిది అధికార షిండే గ్రూపు పట్ల అనుకూల వైఖరే! బిజెపి ఏకపక్ష విధానాలతోనూ, అనుచిత జోక్యంతోనూ నాటి శివసేన ప్రభుత్వ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే తీవ్రంగా విభేదించటంతో - చీలిక దారిలో ఆ ప్రభుత్వాన్ని కూలగొట్టటానికి కాషాయ పార్టీ వ్యూహం రచించింది. ఏకనాథ్ షిండే తన సొంత పార్టీలో చీలిక తలపెట్టినప్పుడు లోపాయికారీగా తగు అండదండలు అందించింది. అదంతా ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని పైకి చెబుతూ- లోలోపల గవర్నరు కోషియార్ సహాయంతో మొత్తం నాటకం నడిపించింది. 2022 జూన్ 25న ఏకనాథ్ షిండే కొంతమంది ఎమ్మెల్యేలతో శివసేన నుంచి చీలిపోవడం, మూడు నాలుగు ప్రాంతాల్లో క్యాంపు రాజకీయాలు నడవడం, లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నాక బిజెపి మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధపడడం, గవర్నరు కోషియార్



అందుకు అంగీకరించటం చకచకా జరిగిపోయాయి. స్పీకరు నార్లేకర్ చీలిక గ్రూపునకు అనుకూలంగా వ్యవహరించటం అప్పుడే మొదలుపెట్టారు. శాసనసభలో షిండే, ఠాక్రే గ్రూపుల బలపరీక్షకు ఆదేశించారు. చీలిక గ్రూపులోని భరత్ షెట్ గాగ్వాలేకు విప్ జారీ అధికారం కట్టబెట్టారు. చీలిక గ్రూపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయమని నాటి డిప్యూటీ స్పీకరు నరహరి జరివాల్ ఇచ్చిన పిటిషన్‌ను స్పీకర్ మడత పెట్టి తన కుర్చీ కింద పెట్టుకున్నారు. ఇలా అన్ని సందర్భాల్లోనూ ఆయన రాజ్యాంగ విరుద్ధంగా, నీతిబాహ్యంగా వ్యవహరించారు. బిజెపి మద్దతుతో షిండే గ్రూపు అధికార ఫీఠం ఎక్కి నిలబడ్డానికి రాజ్యాంగబద్ధంగా ఏమేమి చేయకూడదో- అవన్నీ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై ఉద్ధవ్ ఠాక్రే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలో బెంచి 2023 మే 11వ తేదీన ఏకగ్రీవ తీర్పును వెలువరించింది. గవర్నరు, స్పీకర్‌ల రాజకీయ పక్షపాత వైఖరులను తీవ్రంగా తప్పు పట్టింది. గవర్నరు కోషియార్ తన పరిధిని దాటి వ్యవహరించారని విమర్శించింది. స్పీకరు నార్లేకర్ చీలిక గ్రూపునకు విప్ అధికారం కట్టబెట్టటాన్ని ఆక్షేపించింది. "ఉద్ధవ్ థాకరే బలపరీక్షను ఎదుర్కోకుండానే రాజీనామా చేశారు. సంయమనం వహించి ఉంటే తిరిగి ఆయన్ని ఆ పీఠం మీద కూర్చోబెట్టటానికి కూడా ఆలోచించి ఉండేవారం." అని పేర్కొంది. అనర్హత పిటీషన్లపై స్పీకరు తక్షణం నిర్ణయం ప్రకటించాలని కూడా సూచించింది. అత్యంత తీవ్రమైన ఈ తలంటు పట్ల స్పీకరు నార్లేకర్‌కు పట్టింపు లేకుండా పోయింది. సుప్రీంకోర్టు పెట్టిన రెండు గడువులు ముగిసిపోయాక, జనవరి 10 లోపు తన అభిప్రాయం వెల్లడించాలన్న మరో గడువు నిర్ణయించాక- చిట్టచివరికి నోరు విప్పి, తన మొట్టమొదటి వైఖరికి అనుగుణంగానే తీర్పు చెప్పారు. ఇది పక్షపాత రహితంగా ఉండాల్సిన రాజ్యాంగబద్ధ స్థానానికి మాయని మచ్చ. అధికారమే పరమావధిగా వ్యవహరించే పార్టీలకు, ఆ పార్టీల్లోని వ్యక్తులకు నీతి నియమాలూ, రాజ్యాంగ విలువలూ పట్టవని ఈ వ్యవహారంతో మరోసారి వెల్లడైంది. తనకు తాబేదార్లుగా మారని రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్న చోట బిజెపి కేంద్ర ప్రభుత్వం తన గవర్నర్ల ద్వారా ఇలాంటి నీతిమాలిన చర్యలకే పాల్పడుతోంది. ప్రజల చేత ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాల్లో గవర్నర్ల రూపేణా జోక్యం చేసుకొని రగడ సృష్టించటమే ధ్యేయంగా పనిచేస్తోంది.

# నీటి కష్టాలు... తప్పవా..?

విజయవాడ, జనవరి 13, :రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులన్నీ ఖాళీ అయ్యాయి. గత ఏడాది వర్షాభావ పరిస్థితులకు తోడు వచ్చిన నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోకపోవడంతో జనవరిలోనే ప్రాజెక్టుల్లోని నీటిమట్టాలన్నీ ప్రమాదకర పరిస్థితుల్లోకి పడిపోయాయి. జనవరిలోనే ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు అడుగంటి పోతే జూలైదాకా తాగునీటి అవసరాల సమస్య పరిష్కారం ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. శ్రీశైలం ప్రాజెక్టులో నీరు ఇప్పటికే డెడ్‌స్టోరేజ్ స్థాయికి చేరువయ్యాయి. ప్రస్తుతం శ్రీశైలంలో కేవలం 47.6 టిఎంసిలు మాత్రమే వున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 84.28 టిఎంసిలు వుండేవి. తుంగభద్ర డ్యామ్‌లో గత ఏడాది 67.75 టిఎంసిలు వుండగా, ప్రస్తుతం కేవలం 10.21 టిఎంసిలు వున్నాయి. నాగార్జునసాగర్‌లో గత ఏడాది 273.27 టిఎంసిలు వుండగా, ఈ ఏడాది కేవలం 154 టిఎంసిలు ఉన్నాయి. పులిచింతల ప్రాజెక్టులో గత ఏడాది 44.2 టిఎంసిలు వుంటే ఈ ఏడాది కేవలం 12.45 టిఎంసిలు మాత్రమే వున్నాయి. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో గత ఏడాది 12.94 టిఎంసిలు వుండగా, ఈ ఏడాది కేవలం 2.62 టిఎంసిలు మాత్రమే వున్నాయి. సోమశిల ప్రాజెక్టులో గత ఏడాది 71.90 టిఎంసిలు వుంటే ఇపుడు 31.2 టిఎంసిలు మాత్రమే వున్నాయి. కండలేరు రిజర్వాయర్‌లో గత 52.5 టిఎంసిలు వుంటే ప్రస్తుతం 12.8 టిఎంసిలు మాత్రమే వున్నాయి. ఇలా రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్‌లలో నీటి నిల్వలు జనవరినాటికే అడుగంటిపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా వున్న కృష్ణా, గోదావరి, పెన్నా నదిపై వున్న మొత్తం ప్రాజెక్టుల నీటి సామర్థ్యం 870 టిఎంసిలుకాగా, ఈ ఏడాది కేవలం 289 టిఎంసిలు మాత్రమే వుంది. ఇందులో నాగార్జునసాగర్‌లో డెడ్ స్టోరేజ్ నీటి నీటి నిల్వ 130 టిఎంసిలు, శ్రీశైలంలోని 35 టిఎంసిలతోపాటు ఇతర ప్రాజెక్టుల్లోని డెడ్‌స్టోరేజ్ నీటి మట్టాలను తీసివేస్తే రాష్ట్ర అవసరాల కోసం వినియోగించుకునే నీటినిల్వలు చాలా తక్కువ. ఇపుడున్న కొద్దిపాటి నిల్వలను అయినా జాగ్రత్తగా వాడకపోతే తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితి వుంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# కిర్లంపూడికి నేతల క్యూ..

కాకినాడ, జనవరి 13, :కాకినాడ జిల్లా కిర్లంపూడిలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. టీడీపీ లేదా జనసేనలో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం చేరే అవకాశం ఉందనే వార్తలు రావడంతో అధికార వైసీపీ అలర్ట్ అయ్యింది. ముద్రగడను బుజ్జగించేందుకు వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. ఇప్పటికే వైసీపీ కీలక నేత ఒకరు ముద్రగడతో ఫోన్ లో మాట్లాడినట్లు తెలుస్తోంది.వైసీపీలో చేరాలని కోరినట్లు సమాచారం. ఇక కాపు నేతగా పేరున్న తోట త్రిమూర్తులును రంగంలోకి దింపింది వైసీపీ. ముద్రగడ ఇంటికి ఆయన వెళ్లనున్నారు. అయితే, అధికార పార్టీ వైసీపీ వైపు చూసే ప్రసక్తే లేదని తన అనుచరులతో ముద్రగడ తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ముద్రగడ ఏ నిర్ణయం తీసుకుంటారు అనే విషయంలో ఉత్కంఠ నెలకొంది.ఇప్పటికే జనసేన, టీడీపీ నేతలు ముద్రగడ పద్మనాభంను కలిశారు. దీంతో ముద్రగడ పద్మనాభం టీడీపీ లేదా జనసేనలో చేరే అవకాశం ఉందనే వార్తలు వచ్చాయి. విషయం తెలిసిన వెంటనే అధికార పార్టీ నేతలు అలర్ట్ అయ్యారు. ఆ పార్టీ పెద్దలు రంగంలోకి దిగారు. ముద్రగడను బుజ్జగించే ప్రయత్నాలు ప్రారంభించారు.ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ నేత ముద్రగడతో ఫోన్ లో మాట్లాడినట్లుగా తెలుస్తోంది. ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దని, మీకు సంబంధించి పూర్తి స్థాయిలో మాట్లాడేందుకు మిధున్ రెడ్డి మీ దగ్గరికి వచ్చి మీతో మాట్లాడతారు అని ఆ నేత ముద్రగడ పద్మనాభంతో ఫోన్ లో చెప్పినట్లుగా తెలుస్తోంది. అయితే, ఇప్పటికే నేను నిర్ణయాన్ని అయితే తీసుకున్నాను, వైసీపీ నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా లేనని ఆ కీలక నేతతో ముద్రగడ పద్మనాభం తెగేసి చెప్పినట్లుగా సమాచారం. మరోవైపు కాపు సామాజికవర్గానికి చెందిన కీలక నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును రంగంలోకి దించేందుకు, ముద్రగడ పద్మనాభంతో మాట్లాడేందుకు వైసీపీ వ్యూహాన్ని రచించింది.కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం వైపు మూడు పార్టీలూ చూస్తున్నాయి. టీడీపీ, జనసేన, వైసీపీ.. ఆయన కోసం వేచి ఉన్నాయి. తమ పార్టీలోకి రావాలని ఆహ్వానిస్తున్నాయి. మరోవైపు ముద్రగడ పద్మనాభం కుమారుడు గిరిబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈసారి కచ్చితంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తామన్నారు గిరిబాబు. ఈసారి మా నాన్న, నేను ఇద్దరం పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే, పిఠాపురం నుంచి పోటీ చేస్తారా? ప్రత్తిపాడు నుంచి బరిలోకి దిగుతారా? లేదా కాకినాడ ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తారా? అన్నదానిపై క్లారిటీ రావాల్సి ఉంది. మూడు పార్టీలకు చెందిన నేతలు ముద్రగడతో సంప్రదింపులు జరుపుతున్నారు. ముద్రగడను తమ పార్టీలోకి ఆహ్వానించేందుకు ఎవరికి వారు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, ముద్రగడ పద్మనాభం మాత్రం జనసేన వైపు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం.

## పొట్టేళ్ల పందాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మొండి తోక జగన్ మోహన్ రావు ఎమ్మెల్సీ అరుణ్ కుమార్



కంచికచర్ల జనవరి 13 ప్రజాపాలన ప్రతినిధి మండ లంలోని గండేపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాలు పురస్కరించుకొని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకు లు పరిటాల రామకోటేశ్వరరావు, నల్లిబోయిన తిరు మల రావుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాటు పొ ట్టేళ్ల పందాలను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ శనివారం ప్రారంభించా రు.అనంతరం గ్రామస్తులతో కలిసి కొద్దిసేపు పొట్టేళ్ల పందాలను వీక్షించారు ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు, తెలుగుదనం ఉట్టిపడే పండుగని ఈ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ వాతావరణం లో ఆహ్లాదకరమైన పోటీలను జరుపుకోవాలని, ఎటువం టి హింస లేకుండా పొట్టేళ్ల పందాలు జరగాలన్నారు. సంక్రాంతి పండుగ అనగానే ఎటు చూసినా బంధువు లు, మిత్రులతో ప్రతి ఇల్లు కళకళాడుతుందని.. ప్రతి ఇంటి ముంగిట మహిళలు రంగవల్లుతో అందంగా అ లంకరిస్తారని హరిదాసుల కీర్తనలతో వీధులు పం డగ వాతావరణాన్ని సంతరించుకుంటాయన్నారుఈ కా ర్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాం గ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పా ల్గొన్నారు

## వైయస్సార్ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలో చేరిక లు కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే తా తయ్య



జగ్గయ్యపేట జనవరి 13 ప్రజాపాలన ప్రతినిధి మం డలం చిల్లకల్లు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్ఆ ర్ పార్టీ నాయకులు మాతంగి కిరణ్ కుమార్, మాతం గి చిన్నబాబు, బుడుగు సామ్యేల్ చిలకల్లు గ్రామ తె లుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో టీడీపీ జా తీయ కోశాధికారి జగ్గయ్యపేట నియోజకవర్గ తె లుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాత య్య సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీ రికి తాతయ్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్నటువంటి అరాచకాలు,అక్రమాలు, పేద ప్రజల పై వేస్తున్నటువంటి అదిక పన్నులు నచ్చక, చంద్రబా బు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో లోని పథకాల కు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. తా తయ్య గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వారు తెలిపా రు.ఈ సందర్భంలో తాతయ్య మాట్లాడుతూ తెలు గుదేశం పార్టీ మేము మీకు ఎప్పుడూ అండగా ఉం టామని తెలిపారు.ఈ కార్యక్రమంలో చిల్లకల్లు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తు న పాల్గొన్నారు.

# దయనీయం... సిట్టింగ్ ల పరిస్థితి

అనంతపురం, జనవరి 13, :ఎమ్మెల్యేలంతా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఒకప్పుడు ప్రియ శిష్యులు. ఇప్పుడు ఆ ఎమ్మెల్యేలే రాజకీయంగా బద్ధ శత్రువుల య్యారు. నిన్న మొన్నటి వరకు అధికార వైసీపీలో ఎమ్మెల్యేలుగా వారి ఆధిపత్యం కొనసాగించారు. ప్రస్తుతం ఆ నియోజకవర్గాల్లో వైఎస్ఆర్ తరపున కొత్త ఇంఛార్జీలు వచ్చారు. దీంతో పరిస్థితి ఒక్క సారిగా మారిపోయింది. సిట్టింగ్ ఎమ్మెల్యేల దుస్థితి దయనీయంగా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు చెందిన ఆర్థిక లావాదేవీలు, వ్యాపా రాలపై ప్రభుత్వ అధికారులు దృష్టి పెట్టారు. దాడులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపే అంటున్నారు ఎమ్మెల్యే అనుచరులు. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఇన్నేళ్లుగా చేస్తున్న మైనింగ్‌పై దాడులకు దిగారు వాణిజ్య పనుల శాఖ, మైన్స్ అధికారులు. బొమ్మనహాల్ మండలం నేమకల్లు సమీపంలో ఉన్న క్వారీల్లో తనిఖీలు చేపట్టారు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు. జీఎస్టీ లేకుండానే వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అన్నింటినీ ఆపేయాలంటూ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అనుచరులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. గురువారం సాయంత్రం నుంచి క్వారీ వద్ద ముడి సరుకు రవాణా లారీలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అధికార పార్టీలో ఇన్నేళ్లుగా ఎమ్మెల్యే కాపు రామచంద్ర రెడ్డి చేస్తున్న అక్రమాలపై టీడీపీ ఆందోళన చేస్తే నిర్దాక్షిణ్యంగా అణిచివేశారు. తాజాగా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అధికార పార్టీకి రాజీనామా చేయడంతో ఒక్కసారిగా వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు రంగంలోకి దిగారు. తమను కాదని తమకు బైబై చెప్తున్నా వైసీపీని వీడి వెళ్తున్న నేతలపై అధికారపార్టీ పెద్దలు గరంగరం అవుతున్నారు.కదిరి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వైసీపీ నుంచి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్న అధికార పార్టీలోని ముఖ్య నేతలనే ప్రభుత్వం టార్గెట్ చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వారి వ్యాపార కార్యకలాపాలపై వివిధ శాఖల అధికారులు దాడులు చేస్తున్నారని అంటున్నారు. కదిరి, రాయదుర్గం ఎమ్మెల్యేల వెంట వెళ్తున్న వైసీపీలోనే అసమ్మతి నేతలపై వైసీపీ అధిష్టానం ఫోకస్ పెట్టినట్టు కనిపిస్తోందని టాక్. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి అనుచరులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపణలున్నాయి. తమను కాదని మరొక పార్టీలోకి వెళ్తే ఎంతటివారైనా వదిలేది లేదన్నట్లు వైసీపీ అధిష్టానం వ్యవహరిస్తోందనే టాక్ వినిపిస్తోంది. ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వాధికారులకు పట్టలేదని ఇప్పుడు మాత్రం దాడులు చేస్తున్నారని ప్రతిపక్ష నేతలు అంటున్నారు.

**బాలశౌరి ఔట్**

కృష్ణా జిల్లాలో ఇప్పటికే వైసీపీ అధ్యక్షుడు, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసుపార్థసారథి టిడిపిలో చేరుతున్న నేపథ్యంలో అదే జిల్లాలో వైసీపీ బీటలు వారుతుంది. కాపు సామాజిక వర్గానికి చెందిన బాలశౌరికి టికెట్ లేదనే ఖరారు కావడంతో ఆయన వైసీపీని దాదాపు వీడతారని ప్రచారం జరుగుతుంది. జనసేనలో చేరవచ్చని వార్తలు అందుతున్నాయి. ఎమ్మెల్యే పేర్నినానితో విభేధాలు తారాస్థాయికి చేరుకోవడంతో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. పేర్ని నానితో బాటు కృష్ణా జిల్లా వైసీపీ నేతలు మరో మారు జగన్ దృష్టికి బాలశౌరి గూర్చి ఫిర్యాదు చేశారు. జగన్ అసంతృప్తి నేతలను సముదాయిస్తున్నప్పటికీ బాలశౌరిని వదులుకోవడం వైసీపీ అధినేతను వదులుకోవడం ఏ మాత్రం ఇష్టం లేదు. జగన్ కు అత్యంత సన్నిహితుడైన బాలశౌరి వైసీపీని వీడటం పెద్ద నష్టంమనే చెప్పాలి. దాదాపు రెండు సంవత్సరాల నుంచి వైసీపీ అధిష్టానికి జిల్లా నేతలు బాలశౌరికి టికెట్ ఇవ్వొద్దని వత్తిడి తెస్తున్నారు. జగన్ ఫోటో లేకుండానే బందరులో పబ్లిక్ మీటింగ్స్ నిర్వహిస్తున్నారు. దీన్ని బట్టి బాలశౌరి వైసీపీకి స్వస్తి పలికినట్టేనని పరిశీలకులు భావిస్తున్నారు.

# 19న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

విజయవాడ, జనవరి 13, :ప్రపంచ దేశాలు గర్వించదగ్గ మహా మనిషి, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహా విష్కరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేదికగా మారింది. హిందువుల పెద్ద పండగ సంక్రాంతి సంబరాలకు కొనసాగింపుగా జనవరి 19వ తేదీన విజయవాడ నగరంలోని బీడబ్ల్యాడి గ్రౌండ్లో ఏర్పాటు చేసిన 125 అడుగుల భారీ విగ్రహ ఆవిష్కరణ చేయనున్నారు.బలుగు, బలహీన వర్గాలకు అండగా, ఆశజ్యోతిల వెలిగిన, బీసీ, ఎస్టీ, ఎస్సీ సహా ఇతర వర్గాల ప్రజల సమాన హక్కుల కోసం పోరాడి, భారత రాజ్యాంగాన్ని లిఖించడంలో డా. బీఆర్. అంబేద్కర్ ప్రధాన పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఆయన విగ్రహ అవిష్కరణ రోజును రాష్ట్ర పండుగగా జరుపుకోవాలని బీసీ రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ పిలునిచ్చారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ .. ఇతర వర్గాల ప్రజల తరపున ఉత్తరాంధ్ర రాష్ట్రంలో బీసీ, ఎస్టీ, ఎస్సీ మరియు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలె విగ్రహ ఏర్పాటు చేయాలనీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి కోరినట్లు తెలిపారు.రాష్ట్రంలో అతి పెద్ద విగ్రహ ఆవిష్కరణ ఇప్పటి వరకు ఏ రాజకీయ నాయకుడు కూడా చేయలేదు. మనసున్న ముఖ్యమంత్రి.ఎస్టీ, ఎస్సీ మరియు బలహీన వర్గాల ప్రియతమ నేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి 125 అడుగుల డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయటం చాలా సంతోషంగా ఉందని బీసీ రాష్ట్ర సెల్ సభ్యుడు .. బెజవాడ రూరల్ అధ్యక్షుడు బెజవాడ గణేష్ అన్నారు.
























**కావలెను**

స్నేహ గ్రూప్ విజయవాడ, గుంటూరు, వైజాగ్
హైదరాబాద్ నందు పనిచేయుటకు
మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
నెలకు రూ.15,000/- జీతం,
ట్రావెలింగ్ అలవెన్సు, ఇన్సెంటివ్ ఇవ్వబడును.
ఆసక్తి గలవారు మీ వివరాలని
ఈ క్రింది నెంబర్ కి వాట్సాప్ చేయగలరు.
7660027683, 91549 58315

# ఎంపీ వద్దు... ఎమ్మెల్యేనే కావాలి

విజయనగరం, జనవరి 13, :ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టి ఆపై మంత్రి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు ఆయన.. సీఎం జగన్మోహన్ రెడ్డి ఆయన ఆకాంక్షలను నీరుగారుస్తూ పార్లమెంటుకు వెళ్లాలని సూచిస్తున్నారు. సీఎం మాట కాదనలేక.. ఎన్నాళ్ళ నుంచో ఉన్న కోరికను తీర్చుకోలేక ఆ కీలక నేత తీవ్రంగా మదన పడుతున్నారు. ఆ నేతే విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను. విజయనగరం జిల్లా రాజకీయాలను కొన్నాళ్లుగా శాసిస్తూ వస్తున్న బొత్స సత్యనారాయణ మేనల్లుడుగా కొన్నాళ్లపాటు తెర వెనక రాజకీయాలు నడిపిన చిన్న శ్రీను గడిచిన ఎన్నికల్లోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. జడ్పిటిసి గా ఎన్నికైన ఆయనను సీఎం జగన్ మోహన్ రెడ్డి జిల్లా పరిషత్ ఛైర్మన్ గా నియమించారు. ఇన్నాళ్లు తెరవెనక రాజకీయాలు నెరుపుతూ వచ్చిన శ్రీనివాసరావు తొలిసారి ప్రత్యక్ష రాజకీయాలు చేయడంతోపాటు అధికారికంగా అధికారాన్ని చెలాయిస్తున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టాలని అనుచరుల వద్ద అనేకమార్లు చిన్న శీను చెప్పినట్లు చెబుతారు. అందుకు అనుగుణంగానే నేత గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నారు. విజయనగరం జిల్లాలోని ఎస్ కోట నియోజకవర్గంతోపాటు, శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి చిన్న శ్రీను బరిలోకి దిగుతారని అనుచరులు చెబుతూ వచ్చారు. ఆయా నియోజకవర్గాల నేతలతో నిత్యం టచ్ లో ఉంటూ చాప కింద నీరులా కార్యకలాపాలను నిర్వర్తిస్తూ వస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలకు తన రాక ఇబ్బందిగా పరిణమించకుండా ఉండేలా సీఎం జగన్ మోహన్ రెడ్డి తో వారికి భరోసా ఇప్పించేందుకు ప్రణాళికలు వేశారు. అనూహ్యంగా సీఎం జగన్మోహన్ రెడ్డి చిన్న శ్రీనును పార్లమెంటు బరిలోకి దించాలని యోచించారు. ఇదే ఇప్పుడు ఆ నేతకు మింగుడు పడడం లేదు. విజయనగరం జిల్లాలో ఇద్దరు మంత్రు లు ఉన్నారు. వీరిలో ఒకరు సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ కాగా, మరో మంత్రి పీడిక రాజన్న దొర ఉన్నారు. అయితే వీరిద్దరి కంటే సీఎం జగన్ మోహన్ రెడ్డి తో చిన్న శ్రీను కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. విజయనగరం జిల్లాలో ఏ కార్యక్రమాన్ని సీఎం చేపట్టిన.. దానికి సంబంధించిన పనులన్నింటినీ చక్కబెట్టేది మజ్జి శ్రీనివాసరావే. సీఎంతో ఉన్న సంబంధాలు కారణంగానే తాను వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ బరిలో ఉంటానని సన్నిహితులు వద్ద పలుమార్లు చెప్పారు. కానీ, అనూహ్యంగా విజయనగరం పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయించాలని అధిష్టానం యోచించడమే కాకుండా.. అందుకు అనుగుణంగానే సిగ్నల్స్ అందించారు. ఇదే ఇప్పుడు ఆ నేతకు మింగుడు పడడం లేదు. ఈ ఎన్నికల్లో అసెంబ్లీలో అడుగుపెట్టి.. అధికారంలోకి వస్తే వెంటనే మంత్రి పదవి దక్కించుకొని ఆ అధికార దర్పాన్ని కూడా ప్రదర్శించాలని భావిస్తూ వచ్చిన చిన్న శ్రీను తాజా నిర్ణయంతో నిరాశలో కూరుకు పోయినట్లు చెబుతున్నారు. పార్టీ ఆదేశాలను పాటించడమే తప్ప చేసేదేమీ లేదు అంటూ సన్నిహి తులు వాపోతున్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావును విజయనగరం పార్లమెంటు అభ్యర్థిగా పోటీకి దించాలని పార్టీ నిర్ణయించింది. ఇక్కడ సిట్టింగ్ ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్ ఉన్నారు. ఈయనకు ప్రత్యామ్నాయం చూపించడకుండా మజ్జి శ్రీనివాసరావును ఖరారు చేస్తే ఇబ్బందులు వస్తాయని పార్టీ భావిస్తోంది. బెల్లాన చంద్రశేఖర్ ను అసెంబ్లీకి పంపించే ఆలోచనలో అధిష్టానం ఉందని చెబుతున్నారు. అన్నీ కుదిరితే ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానాన్ని బెల్లానకు కేటాయించే అవకాశం ఉంది. అక్కడ లోకల్ ఎమ్మెల్యే గొర్ల కిరణ్ ప్రస్తుతం ఉన్నారు. ఈ నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించే అవకాశం ఉంది. వీరిద్దరిలో ఎవరికో ఒకరికి అసెంబ్లీ స్థానాన్ని కేటాయించి.. మరొకరికి నామినేటెడ్ పోస్ట్ అందిస్తామని హామీ ఇచ్చే దిశగా వైసిపి ముఖ్య నాయకులు చర్చలు జరుపుతున్నారు. ఈ సీటు వ్యవహారం తేలక పోవడం వల్లే విజయనగరం పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థిని వైసిపి ప్రకటించలేదు. ఇప్పటికే విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తో వైవి సుబ్బారెడ్డి చర్చలు జరిపారు. ఇక్కడ జరిపిన చర్చలు విఫలం కావడంతో సీఎం వద్దకు వెళ్లారు. సీఎంతో చర్చలు ముగిసిన తర్వాతే అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం దక్కనున్నట్లు ఎంపీ బెల్లాన సన్నిహితులతో చెప్పినట్లు చెబుతున్నారు.

# జనసేన వైపు కొణతాల..



విశాఖపట్టణం, జనవరి 13, :టీడీపీ, జనసేన కూటమి ఇతర పార్టీల నేతలకు హాట్ ఫేవరేట్ గా మారింది. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఏదో ఓ పార్టీలో చేరేందుకు సీనియర్ నేతలు ప్రయత్నిస్?తన్నారు. జాగా మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ త్వరలోనే జనసేన లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన ఆయన తర్వాత వైసీపీలో చేరి రాజకీయంగా దెబ్బతిన్నారు. చాలా కాలంగా ఖాళీగా ఉన్న ఆయన ఎన్నికలకు ముందు యాక్టివ్ అవుతున్నారు. ఆయన జనసేన నేతలతో టచ్ లోకి వచ్చిటన్లుగా తెలుస్తోంది. అనకాపల్లిలో తన అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసుకుని జనసేనలో చేరికపై కొణతాల క్లారిటీ ఇస్తారని ఆయన అనుచరులు చెబుతున్నారు. పవన కల్యాణ్ తో ఇప్పటికే మాట్లాడారని అంటన్నారు. వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి బరిలోకి దిగాలని కొణతాల భావిస్తున్నారు. కొణతాల రామకృష్ణ. కాంగ్రెస్ హయాంలో ఉత్తరాంధ్ర రాజకీయాల్లో చక్రం తిప్పారు.. ఉమ్మడి విశాఖజిల్లాలో బలమైన గవర సామాజిక వర్గం ప్రతినిధిగా చెలామణీ అయ్యారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవంలో పదేళ్లు పదవుల్లో ఉన్నారు. 1989లో కాంగ్రెస్ పార్టీ తరపున అనకాపల్లి ఎంపీగా పోటీ చేసిన కొణతాల.. కేవలం తొమ్మిది ఓట్లతో గెలిచారు. ఒక ఎంపీ సింగిల్ డిజిట్ మెజారిటీతో గెలవడం ఇప్పటికీ రికార్డే. అయితే 2009లో ఓడిపోయినప్పటికీ కొంత కాలం ఆయన హవా నడిచింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో కాంగ్రెస్ ను వీడి వైసీపీలో చేరారు. అప్పట్లో పార్టీకి సంబంధించిన ముఖ్య నిర్ణయాల్లో ఆయన భాగస్వామ్యం ఉండేది. 2014లో పార్టీ ఓడిపోవడం, విశాఖ ఎంపీ సీటులో ఎదురైన వైఫల్యాలు కొణతాలను వైఎస్ జగన్ దూరం పెట్టారు. ఆ తర్వాత యాక్టివ్ పాలిటిక్స్ పక్కన పెట్టేసిన రామకృష్ణ సైలెంట్ అయిపోయారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం పలు అధ్యయన వేదికలు, సభలు నిర్వహించేవారు. రైతు సమస్యలపై దృష్టి పెట్టారు. చెరకు సాగు ఇబ్బందులు, సహకార రంగంలో షుగర్ ఫ్యాక్టరీలు మూత పడటం వంటి వాటిని అజెండాగా పెట్టుకుని వీలున్నప్పు డల్లా నియోజకవర్గాల్లో తిరుగుతూ వచ్చారు. గత ఎన్నికల ముందు టీడీపీ ఆహ్వానం మేరకు చంద్రబాబును కలిశారు. టీడీపీలోచే రుతారని అనుకున్నారు కానీ.. టీడీపీ నేతల వర్గ పోరాటం వల్ల చేరలేకపోయారు. ఆ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇప్పుడు కొణతాల రామకృష్ణ జనసేన వైపు చూస్తున్నారు. సీట్ల సర్దుబాటులో ఉత్తరాంధ్రలో అనకాపల్లి పార్లమెంట్ సీటు జనసేనకు వస్తే బలమైన అభ్యర్థి అయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# తైవాన్‌పై యుద్ధమేఘాలు

**ఇప్పటికే అష్టదిగ్బంధనం చేసిన చైనా**

- సైనికచర్య తప్ప అన్ని రకాలుగా డ్రాగన్ దాడులు
- నెట్‌వర్క్‌ను స్వాధీనం చేసుకున్న సైబర్ సంస్థలు
- నేడు తైవాన్‌లో జరుగనున్న అధ్యక్ష ఎన్నికలు



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్



చైనా నుంచి ముప్పు పొంచి ఉండటంతో ఇటీవల తైపీ సమీపంలో ఆకాశంలో తైవాన్ జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆ దేశ సైనిక హెలికాప్టర్



తైవాన్ అధ్యక్షురాలు త్సాయి ఇంగ్-వెన్

తైపే, జనవరి 12: చైనాకు ద్వీపదేశంగా ఉన్న తైవాన్‌పై యుద్ధమేఘాలు ముసురుకుంటున్నాయి. తైవాన్‌లో శనివారం జరుగనున్న ఎన్నికల్లో వెలువడే ఫలితాల ఆధారంగా ఆ దేశ భవితవ్యం ఆధారపడి ఉంటుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. తైవాన్‌ను తన చెప్పుచేతుల్లోకి తీసుకోవాలని భావిస్తున్న చైనా ఇప్పటికే ఉచ్చు బిగుస్తున్నది. ద్వీపకల్పాన్ని అష్టదిగ్బంధనం చేసిన చైనా ఆ దేశ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను కూడా తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నట్టు తెలుస్తున్నది. దీంతో తైవాన్‌లోని బ్యాంకులు మూతపడుతున్నాయి. ప్రజలు కోట్ల రూపాయల లావాదేవీలను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. తైవాన్‌లోని ప్రపంచంలోనే అత్యంత అధునాతన సెమికండక్టర్ పరిశ్రమ స్తంభించిపోయింది. చైనా ప్రత్యక్షంగా తన సేనలను పంపడం తప్ప మిగిలిన అన్ని విధాలుగా తైవాన్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నది. చైనా ప్రత్యక్షంగా దాడికి దిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు రూ.828 లక్షల కోట్ల నష్టం జరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

స్వయంప్రతిపత్తి పాలనలో ఉన్న తైవాన్‌ను చైనా తనదిగా భావిస్తున్నది. చైనా తమపై దాడిచేసిన రోజున కేవలం తమ రక్షణ వ్యవస్థకు, భద్రతా దళాలకు మాత్రమే నష్టం జరుగదని, తైవాన్‌ను పూర్తిగా ప్రపంచం నుండి వేరుచేయడానికి ప్రయత్నిస్తుందని ఆ దేశ సైబర్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే తైవాన్ కంప్యూటర్ నెట్‌వర్క్‌పై ప్రతిరోజు లక్షల సంఖ్యలో దాడులు జరుగుతున్నాయని తైవాన్ జాతీయ రక్షణ, భద్రత పరిశోధన సంస్థ నిపుణుడు క్రిస్టల్ టు చెప్పారు. ఇప్పటికే కొందరు తమ నెట్‌వర్క్‌ను వారి స్వాధీనంలోకి తీసుకొని 'ఆ రోజు' కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. చైనా ఆక్రమణను ప్రకటించగానే వారు తమ టెలికమ్యూనికేషన్లను, ఇంధనం, ఆర్థిక రంగాలను స్తంభింపచేయగలరని పేర్కొన్నారు. సైబర్ దుండగులు తైవాన్ ప్రభుత్వ, రక్షణ సంస్థలనే కాకుండా అక్కడి సెమికండక్టర్ పరిశ్రమను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థకు జీవనాడిగా పేర్కొనే చిప్స్ సరఫరాలో తైవాన్ కంపెనీలు కీలకంగా ఉన్న సంగతి తెలిసిందే. సెమికండక్టర్ పరిశ్రమలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను అవసరమైతే ధ్వంసం చేస్తాం తప్ప వాటిని చైనా దళాల చేతిలో పడనివ్వబోమని అమెరికాకు చెందిన ఓ అధికారి గత ఏడాది అన్నారు.

### 2016 నుంచే ఒత్తిడి

డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీకి చెందిన త్సాయి ఇంగ్-వెన్ తైవాన్ అధ్యక్షురాలిగా ఎన్నికైన 2016 నుంచే చైనా ఆ దేశంపై దౌత్యపరమైన, సైనికపరమైన ఒత్తిడిని ప్రారంభించింది. తైవాన్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకోవడంతోపాటు తమపై ఇతర దేశాల పెత్తనాన్ని నిరాకరించడం చైనాకు కంటగింపుగా మారింది. క్రమంగా తైవాన్‌కు అడ్డంకులు సృష్టించడం ప్రారంభించింది. దీంతో ఏదో ఓ రోజున చైనా తైవాన్‌పై దురాక్రమణకు పాల్పడవచ్చన్న ఊహాగానాలు మొదలయ్యాయి. సైబర్ దాడులతో చైనా ఆగిపోదని, ప్రపంచంతో తైవాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టేందుకు ప్రయత్నించగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

### చైనా దాడి విలువ 10 లక్షల కోట్ల డాలర్లు

తైవాన్‌పై యుద్ధం జరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 10 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టం జరుగుతుందని బ్లూమ్‌బర్గ్ ఎకనామిక్స్ సంస్థ అంచనా వేసింది. ఇది ప్రపంచ జీడీపీలో పదిశాతంగా ఉంటుందని పేర్కొంది. ఇది ఉక్రెయిన్ యుద్ధం కన్నా, కరోనా మహమ్మారి కన్నా, ప్రపంచ ఆర్థిక సంక్షోభం వల్ల జరిగిన నష్టం కన్నా ఎక్కువ అని తెలిపింది. తైవాన్ ప్రజల్లో పెరుగుతున్న జాతీయవాద భావన, వాషింగ్టన్ – బీజింగ్ మధ్య విచ్ఛిన్నమవుతున్న సంబంధాలు, పెరుగుతున్న చైనా ఆర్థిక, సైనిక శక్తిని బట్టి తైవాన్‌లో సంక్షోభం తప్పకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా దురాక్రమణకు పాల్పడితే.. తైవాన్‌లోని సెమికండక్టర్ల వ్యవస్థ కుప్పకూలుతుందని, దీంతో ప్రపంచవ్యాప్తంగా ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, స్మార్ట్‌ఫోన్ల తయారీ స్తంభించిపోతుందని అంటున్నారు.

